నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 29-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 157 | పేజీలు:4 | వెల: రూ.1/-

6 కోట్ల రైతులకు రూ.12వేల కోట్లు.. ఇది రికార్డు: మోదీ

హైదరాబాద్, జనవరి 28: ఆరు కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సుమారు 12వేల కోట్లు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి రికార్డు సృష్టించామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గుజరాత్‌లో జరుగుతున్న గ్లోబల్ పొటాటో కాన్‌క్లేవ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ మాట్లాడారు. కొన్ని రకాల ఆహార ధాన్యాలు, ఉత్పత్తుల తయారీలో భారత్ టాప్ త్రీ దేశాల్లో నిలిచిందని మోదీ అన్నారు. 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నదన్నారు. రైతులు, కేంద్రం చేపట్టిన చర్యల వల్లే ఆహార ఉత్పత్తుల్లో భారత్ అగ్ర స్థానానికి చేరుకున్నట్లు ప్రధాని చెప్పారు.

కలకలం రేపుతున్న కరోనా

జెట్‌స్పీడ్‌తో ప్రపంచదేశాలకు వ్యాప్తి

చైనాలో 106కు చేరిన మృతుల సంఖ్య

బీజింగ్,జనవరి28(ఆర్ఎన్ఎ): చైనాలో కరోనా వైరస్ కలకలం రేపుతోంది. దీంతో అక్కడి ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ప్రస్తుతం కరోనా మృతుల సంస్థ 106కు చేరింది. దాదాపు 4వేల మందికిపైగా కరోనా వ్యాదితో బాధపడుతున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. కరోనా సోకిన బాధితులు నుమోనియా వ్యాధితో ప్రాణాలు కొల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పలునగరాలకు రవాణా వ్యవస్థను నిలిపివేసింది. కాగా ప్రత్యేక వార్డుల ద్వారా బాధితులకు చికిత్సనందిస్తున్నారు. కరోనా భారత్ కు వ్యాపించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా బీహార్ లో ఓ యువతికి కరోనా వైరస్ లక్షణాలు బయటపడ్డాయి. చైనా, హాంగ్ కాంగ్ నుంచి వచ్చిన ప్రయాణికుల్లో భయాందోళనలు గురవుతున్నారు. టిబెట్ తప్ప మిగితా చైనా ప్రాన్సుల్లో కరోనా బాధితులు ఉన్నారు. థాయిలాండ్, జపాన్, దక్షిణ కొరియా, అమెరికా, వియత్నాం, సింగపూర్, మలేషియా, నేపాల్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, శ్రీలంక దేశాల్లో కరోనా కేసులు నమోదు అయ్యాయి సమాచారం. కాగా, దేశవ్యాప్తంగా స్కూళ్లకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది.

కరోనాకు థాయివాసి మృతి

కరోనా వైరస్ సోకిన బాధితులు న్యూమోనియా వ్యాధితో మరణిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోనూ కరోనా వైరస్ వ్యాధి లక్షణాలతో బాధపడుతూ థాయిలాండ్‌కు చెందిన ఓ వ్యక్తి నిన్న మృతి చెందాడు. థాయిలాండ్ జాతీయుడు.. గతేడాది నవంబర్ నుంచి కోల్‌కతాలో నివసిస్తున్నాడు. శ్వాస సంబంధిత సమస్యలతో జనవరి 21న కోల్‌కతాలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరాడు. అయితే అతనికి కడుపునొప్పి, జ్వరం, వాంతులు రావడంతో ఐసీయూకు తరలించారు. చికిత్స పొందుతూ థాయిలాండ్ జాతీయుడు మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అతను కరోనా వైరస్ వ్యాధి లక్షణాలను కలిగి ఉన్నాడని వైద్యులు చెప్పారు. అయితే ఆ వైరస్ సుమారు 4515 మందికి సోకినట్లు తాజాగా అధికారులు నిర్ధారించారు. ఒక టిబెట్ మినహా.. మిగితా చైనా ప్రాన్సుల్లో కరోనా కేసులు నమోదు అయ్యాయి. థాయిలాండ్, జపాన్, దక్షిణ కొరియా, అమెరికా, వియత్నాం, సింగపూర్, మలేషియా, నేపాల్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, శ్రీలంక దేశాల్లో కరోనా కేసులు నమోదు అయ్యాయి. కరోనా కేంద్ర బిందువైన హుబెన్ ప్రావిన్సులో వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది.

మౌలిక వసతులకు నిధులు ఇవ్వండి

కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథకు సాయం అందించండి

ఆర్థిక సంఘాన్నికోరిన మంత్రి హరీష్ రావు

న్యూఢిల్లీ,జనవరి28(ఆర్ఎన్ఎ): 15వ ఆర్థిక సంఘం సమావేశానికి తెలంగాణ ఆర్థిక మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు. ఆర్థిక సంఘం చైర్మన్ నందకిషోర్ సింగ్ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం న్యూఢిల్లీలో జరుగుతోంది. మౌలిక వసతులకు నిధులు ఇవ్వాలని హరీష్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథకు నిర్వహణ నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ రాసిన లేఖను నందకిశోర్ సింగ్‌కు అందజేశారు. నీతి ఆయోగ్ సిఫారసు మేరకు మిషన్ భగీరథకు రూ.19వేల కోట్లు.. కేంద్రం ఇచ్చేలా చూడాలని ఆర్థిక సంఘాన్ని హరీష్‌రావు కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక సంఘం చైర్మన్ నందకిశోర్ సింగ్‌తో మంత్రి హరీష్ రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు భేటీ అయ్యారు.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రం నుండి నిధుల శాతం పెంపు, ఋణపరిమితి పెంపు, మౌలిక వసతులకు నిధులు ఇవ్వాలని మంత్రి హరీష్ రావు కోరారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథకు నిర్వహణ నిధులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీతి ఆయోగ్ సిఫారసు మేరకు మిషన్ భగీరథకు 19వేల కోట్లు కేంద్రం ఇచ్చేలా చూడాలని 15వ ఆర్థిక సంఘం దృష్టికి మంత్రి హరీష్ రావు తీసుకెళ్లారు.

మేడారం జాతరపనులను పరిశీలించిన మంత్రి

గట్టమ్మ జాతర వద్ద ప్రత్యేక పూజల్లో సత్యవతి

ములుగు,జనవరి28(ఆర్ఎన్ఎ): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర దగ్గర పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ ఇవాళ రోడ్డు పనులను సమీక్షించారు. మేడారం వెళ్లే దారిలోని ములుగు - నర్సంపేట రోడ్డు పనులను ఆమె పర్యవేక్షించారు. అనంతరం గట్టమ్మ దేవాలయం వద్ద పూజలు చేసి అక్కడి ఏర్పాట్లను చూసారు. ములుగు-నర్సంపేట రోడ్డులో మరిన్ని లైట్స్, బారికేడ్స్ పెట్టాలని అధికారులని ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. మరోవైపు భక్తుల రాకతో మేడారం జనసంద్రంగా మారుతున్నది. మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఇప్పటికే తాత్కాలిక, శాశ్వత అభివృద్ధి పనులు పూర్తికాగా, భక్తులు ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లిస్తున్నారు. ఐటీడీఏ, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, భక్తులు ఎత్తుబెల్లం (బంగారం) ఇచ్చేందుకు పోటీపడుతున్నారు. పెద్ద సంఖ్యలో చేరుకుంటున్న భక్తులు జంపన్నవాగులో స్నానాలు చేసి, తలనీలాలు ఇస్తున్నారు.

గద్దెల వద్దకు చేరుకొని సమ్మక్క, సారక్కకు ఎత్తుబెల్లం, పసుపు, కుంకుమ, సారె పెట్టి గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూజలు చేస్తున్నారు. సమ్మక్క-సారక్కను సోమవారం సుమారు 1లక్షా యాభైవేల మంది భక్తులు దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సులతో పాటు పెద్దసంఖ్యలో ప్రైవేటు వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. భక్తుల కొనుగోళ్లతో పలు దుకాణ సముదాయాలు కళకళలాడాయి. కొబ్బరికాయలకు, కోళ్లకు గిరాకీ జోరుగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు మేడారంతో పాటు రెడ్డిగూడెం, ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్, జంపన్నవాగు వరినర ప్రాంతాల్లో గుడారాలు వేసుకుంటున్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. ప్లాస్టిక్ రహిత జాతరకు ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారు. జాతర నేపథ్యంలో వస్తువుల దిగుమతిలో వేగం పుంజుకుంది. మేడారంలో సమ్మక్క-సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించేందుకు వెళుతున్న వేలాది మంది భక్తులు గట్టమ్మ తల్లికి మొదటి మొక్కు చెల్లించారు.

అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేశారు. గట్టమ్మ తల్లికి ఈ నెల 29న ఎదురుపిల్ల పండుగ నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకపోడు గట్టమ్మ దేవాలయ పూజారి కొత్త సమ్మయ్య, కొత్త లక్ష్మయ్య, ఆరిగెల సమ్మయ్య, ఆకుల మొగిలి, చిర్ర రాజేందర్, మండపు సురేశ్ తెలిపారు. ఆదివాసీ ఆచారాలు, సంస్కృతీ సంప్రదాయాల మధ్య కనువిందు చేసే రీతిలో పండుగ చేపడుతామ పేర్కొన్నారు. ప్రతీ ఇంటి నుంచి భోనాలు, ఆదివాసీల నృత్యాలు సంబురాలతో అమ్మవారికి ఎదురుపిల్లను ఇస్తామని తెలిపారు. ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ, జిల్లా యంత్రాంగం, పొలిటికల్ జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మేడారంలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్

మండలి ఖర్చు వృథా అనడం నాన్సెన్స్

ఎంపీ కె.కేశవరావు

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ) : ఏపీలో శాసనమండలి రద్దు తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం, మండలిపై రూపాయి ఖర్చయినా దండగేనంటూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు స్పందించారు. ఏపీ శాసనమండలి రద్దు నిర్ణయం సరికాదని అభిప్రాయపడ్డారు. మండలి ఖర్చు వృథా వ్యయం అనడం నాన్సెన్స్ అని వ్యాఖ్యానించారు. పెద్దల సభ ఎంతో అవసరమన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్ నాగిరెడ్డిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన తీర్మానాలను కేంద్రం అమలు చేస్తుందని చెప్పారు. అవసరమైతే అమలుకు ఎక్కువ సమయం తీసుకోవచ్చని చెప్పారు.

తుక్కుగూడ పురపాలికలో ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఓటేసిన తనపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వేళ ఆయన కమిషనర్‌ను కలిశారు. నేరేడుచర్లలో కేవీపీ రామచందర్‌రావుకు ఓటు హక్కు కల్పించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 'నేను తప్పు ఓటు వేశాననడం సబబు కాదు. వాస్తవాలన్నింటినీ ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లా. పరస్పరం రాష్ట్రాలు మార్చుకుంటూ నేను, కేపీపీ లేఖలు ఇచ్చాం. అప్పటి కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ఆదేశాలు కూడా ఇచ్చారు. 2014లో గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కేవీపీకి తెలంగాణలో సాధారణ ఓటు హక్కు కూడాలేదు. ఇద్దరికి ఓటుహక్కు ఇవ్వడం సరికాదు.. నేనెలాగూ ఓటు వేశాను. కేవీపీకి ఓటుహక్కు ఇస్తారో లేదో ఎస్ఈసీ చూసుకోవాలి. తప్పు జరిగిందన్నది నేనెలా చెబుతాను?' అని అన్నారు. పుర ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయంపై మాట్లాడుతూ.. ప్రభుత్వ పనితీరు వల్లే తమ పార్టీ అద్భుతమైన విజయాలు సాధిస్తోందన్నారు.

ఢిల్లీలో ముగ్గురికి కరోనా వైరస్

అనుమానాలతో వైద్య చికిత్స

న్యూఢిల్లీ,జనవరి28(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో ముగ్గురికి కరోనా వైరస్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ముగ్గురికి డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. కరోనా రోగులకు ప్రత్యేక వార్డులో ట్రీట్‌మెంట్ ఇస్తున్నట్లు డాక్టర్ మీనాక్షి భరద్వాజ్ తెలిపారు. భారత్‌లో ప్రస్తుతం 450 మందిని అబ్జర్వేషన్‌లో పెట్టారు. కేరళలో ఎక్కువ మందిని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వీళ్లంతా చైనా నుంచి తిరిగి వచ్చినట్లు భావిస్తున్నారు. గత మూడు రోజుల నుంచి సుమారు 29 వేల మంది చైనా నుంచి ఇండియా వచ్చారు. వారిని ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ చేస్తున్నారు. మరోవైపు వుహాన్ సిటీలో ఉన్న సుమారు 250 మంది భారతీయ విద్యార్థులను వెనక్కి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సీఏఏతో అన్యాయాన్ని సరిదిద్దుతాం:ప్రధాని మోదీ

హైదరాబాద్, జనవరి 28: చరిత్రాత్మకంగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకే పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఏఏతో పొరుగు దేశాల్లో ఉన్న మైనార్టీలను రక్షణ కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, అప్పుడు అధికారంలో ఉన్నవారు దేశ విభజనకు అంగీకరించారని, మైనార్టీలకు రక్షణ ఇవ్వాలని నెహ్రూ-లియాకత్ ఒప్పందం స్పష్టం చేసిందని, గాంధీజీ కూడా ఇదే కోరుకున్నారని, భారత్ ఇచ్చిన హామీని నేరవేర్చేందుకే సీఏఏ చట్టాన్ని తీసుకువచ్చినట్లు మోదీ తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నవారే సీఏఏను వ్యతిరేకిస్తున్నారన్నారు. పాక్‌లో ఉన్న మైనార్టీలను ఆదుకోవద్దా అని ఆయన అడిగారు. పారిశుద్ధ కార్మికులుగా కేవలం ముస్లిమేతరులు పాక్‌లో దరఖాస్తు చేసుకుంటారని గతంలో ఆ దేశ ఆర్మీ అధికారి ఒకరు వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



కాగజ్‌నగర్‌లో ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం

మొదటి విడతలో సద్దాం హుస్సేన్‌కు పీఠం

మలి విడతలో రాచకొండ గిరీష్‌కు అవకాశం

ఆసిఫాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని ఇద్దరు పంచుకోనున్నారు. బల్లియా పదవికి టీఆర్ఎస్ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు పోటీ పడడంతో ఐదేళ్ల పదవీ కాలాన్ని పంచుకునేలా పార్టీ నాయకత్వం ఒప్పించింది. ఈ వరుసలో ముందుగా ఒకటో వార్డు కౌన్సిలర్ సద్దాం హుస్సేన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయగా వైస్ చైర్మన్ 21వ వార్డు కౌన్సిలర్ రాచకొండ గిరీష్‌కుమార్ పదవీ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో జరిగిన ఈ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది.

కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికార టీఆర్ఎస్ పార్టీలో చైర్మన్ పదవిపై ఇద్దరు పోటీ పడ్డారు. పదవిని ఆశిస్తూ 1వ వార్డు కౌన్సిలర్ సద్దాం హుస్సేన్, 21వ వార్డు కౌన్సిలర్ రాచకొండ గిరీష్‌కుమార్‌లు పోటీ పడ్డారు. ఇద్దరూ స్థానిక ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులే కావడంతో ఇందులో పదవి ఎవరిని వరిస్తుందోనన్న దానిపై ఉత్కంఠ రేకెత్తించింది. మొదట్లో ఈ పదవిని రాచకొండ గిరీష్ కుమార్‌కు కట్టబెట్ట వచ్చని వార్తలు వచ్చాయి. అయితే ఇద్దరూ చైర్మన్ పదవి తనకంటే తనకని బెట్టువీడకుండా పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవడంతో ఈ పంచాయితీ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమక్షానికి చేరింది. ఆశావహులిద్దరిని పిలిచి కేటీఆర్ స్వయంగా మాట్లాడినప్పటికీ ఇద్దరూ మెట్టుదిగక పోవడంతో ఇరువురికి చెరి సగం పదవీ కాలం పంచాలని నిర్ణయించారు. అయితే ఇక్కడ కూడా ముందు ఎవరికి అవకాశం ఇవ్వాలన్న దానిపై ప్రశ్న తలెత్తడంతో కేటీఆర్ సమక్షంలోనే టాస్ వేసి ముందుగా ఎవరు వీఠంపై కూర్చోవాలన్నదానిపై ఆదివారం మధ్యాహ్నమే నిర్ణయించారు. తాజా నిర్ణయం ప్రకారం ముందుగా ఒకటో వార్డు కౌన్సిలర్, మాజీ వైస్ చైర్మన్ అయిన సద్దాం హుస్సేన్ రెండున్నరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. తదుపరి పదవీ కాలానికి వైస్ చైర్మన్‌గా ఎన్నికైన రాచకొండ గిరీష్‌కుమార్‌కు స్వచ్ఛందంగా పీఠాన్ని బదలాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే నూతన మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల పాటు ఎలాంటి అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. పదవిలో ఉన్న చైర్మన్ స్వచ్ఛందంగా తప్పుకుంటే తప్ప అధికార మార్పిడి జరిగే అవకాశం లేదు.

భారత్ అద్భుత విజయాలు నమోదు చేసుకోవాలి

- అమెరికా

వాషింగ్టన్,జనవరి28(ఆర్ఎన్ఎ) : వివిధ రంగాల్లో భారత్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా తెలిపింది. ముఖ్యంగా భద్రతాపరమైన అంశాల్లో ఇరు దేశాల మధ్య సహకారం నానాటికీ దృఢమవుతోందని అభిప్రాయపడింది. తాజా గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపిన అమెరికా.. ఈ దశాబ్దంలో భారత్ అద్భుతమైన విజయాల్ని నమోదు చేయాలని ఆకాంక్షించింది. నీరు, వాణిజ్యం, అంతరిక్షం, ఇంధనం, భద్రత తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతున్నామని అమెరికా విదేశాంగశాఖలోని దక్షిణ, మధ్య ఆసియా విభాగం స్పష్టం చేసింది. తాజా గణతంత్ర వేడుకల్లో భారత్ ప్రదర్శించిన సైనిక పాటవం ఇరు దేశాల మధ్య బంధానికి సూచికగా నిలిచిందని అభిప్రాయపడింది. చినూక్, అపాచీ హెలికాప్టర్లను అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న విషయం తెలిసిందే. వీటిని తాజా గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించారు.

ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించిన రాందేవ్ బాబా

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రానికి శంషాబాద్ వేదికైంది. శంషాబాద్ సమీపంలోని చేగూర్ గ్రామం పరిసరాల్లో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కన్హా శాంతివనం మంగళవారం ప్రారంభమైంది. ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ధ్యాన కేంద్రంలో ఒకేసారి ఏకంగా 1 లక్ష మంది ధ్యానం చేసుకోవచ్చు. ఇక కన్హా శాంతివనం పై నుంచి చూస్తే తాబేలు ఆకారంలో ఉంటుంది. ఇందులో రోజుకు 1 లక్ష మందికి భోజనాలు పెట్టే విధంగా సదుపాయాలు ఏరాటు చేశారు. 350 పడకలు ఉన్న ఆయుష్ దవాఖాన, 6 లక్షల మొక్కలు కలిగిన నర్సరీలు ఈ ప్రాంగణంలో ఉన్నాయి.

ప్రకృతిని కాపాడితే అదే మనల్ని కాపాడుతుంది: నిర్మల్ కలెక్టర్

నిర్మల్, జనవరి 28: ప్రకృతిని పరిరక్షిస్తే అదే మనల్ని కాపాడుతుందని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఎం. ప్రశాంతి అన్నారు. రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్ ను స్వీకరించిన కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మూడు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, నిర్మల్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోరిపల్లి విజయలక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ శ్యాం నాయక్ మొక్కలు నాటాలని గ్రీన్ చాలెంజ్ లో భాగంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, వచ్చదనం పెంపు కోసం చేపట్టిన హరితహారం, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పథకాలు భావితరాల క్షేమం, మానవ మనుగడ కోసం ఎంతో దోహదపడతాయని అన్నారు. వాతావరణ కాలుష్యం వల్ల సకాలంలో వర్షాలు పడడం లేదని, ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, మంచు కొండలు కరిగి పోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కనీసం మూడు మొక్కలను నాటాలి కలెక్టర్ సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కలెక్టర్ అన్నారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. పర్యావరణం పెంపొందించేందుకు జిల్లాలో 2018 - 19 సంవత్సరం లో హరితహారం లో భాగంగా కోటి పది లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకొని, 100% పూర్తి చేశామన్నారు. 2019 - 20 లో ఇప్పటివరకు 43 లక్షల మొక్కలు నాటామని, వాటిలో 93 శాతం మొక్కలను సంరక్షించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కోఆర్డినేటర్ పురుషోత్తం, జిల్లా పౌరసంబంధాల అధికారి అబ్దుల్ ఖలీం, కలెక్టరేట్ కార్యాలయం పరిపాలన అధికారి కరీం, టి ఎస్ ఎస్ కళాకారులు నాగరాజు, సుదర్శన్, రఘు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన నగరంలోని పంజాగుట్టలో చోటుచేసుకుంది. మృతురాలిని నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఎల్ సాయి దీపికా రెడ్డిగా గుర్తించారు. మంగళవారం ఉదయం పంజాగుట్ట నుంచి యూసుఫ్ గూడ వైపు స్కూటీపై వెళ్తున్న ఆమెను ఆర్టీసి బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన దీపిక రెడ్డి సంఘటనాస్థలంలోనే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఎయిరిండియాను ఎందుకు గాలికి వదిలేశారు?

-కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సామ్నా

ముంబయి,జనవరి28(ఆర్ఎన్ఎ) : ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిరిండియాను ప్రభుత్వం సరైన మార్గంలో ఎందుకు నడిపించలేకపోతోందని శివసేన అధికారిక పత్రిక సామ్నా ప్రశ్నించింది. ఎయిరిండియాలో 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణపై సామ్నా ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. 'భారత్‌కు ఒకప్పుడు ఎయిరిండియా గర్వకారణంగా నిలిచింది. అందుకే దాన్ని మహారాజ అని పిలిచేవాళ్లు. కానీ గత రెండు దశాబ్దాల నుంచి ఎయిరిండియా తీవ్ర రుణభారంతో సతమతమవుతోంది. రుణాలు కోట్లకు కోట్లు పేరుకుపోయాయి. గతంలో 70-80శాతం వాటాను విక్రయించాలని భావించారు. కానీ ఇప్పుడు ఏకంగా ఎయిరిండియా మొత్తాన్ని అమ్మేయాలని నిర్ణయించారు. ఏప్రిల్‌లోపు ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఇతర విమానసంస్థలు మనుగడ సాగించినట్లుగానే ఎయిరిండియా ఎందుకు సాధించలేకపోయింది? ఎయిరిండియా వంటి కంపెనీలను ప్రభుత్వం ఎందుకని సరైన మార్గంలో నడిపించలేకపోతుంది? ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రైవేటీకరణనే ఎందుకు ఎంచుకుంటున్నారు'? అని సామ్నా తన కథనం ద్వారా కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది.

చరిత్రలో నేటినిజం

కం॥ బాలాంత్రపు వంశంబును
లాలించుచు వాణి-తిరుని-రజనీకాంతునే
లిలఁ నందించగ-సం
చాలన మొనరించె నడచు స్వరలాహరులన్!!
[జనవరి 29 బాలాంత్రపు రజనీ కాంతరావు జననం]

(జనవరి 29 బాలాంత్రపు రజనీ కాంతరావు జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

ఇది..మరో వాస్తవం...

మన కేంద్ర ప్రభుత్వం దాదాపు ఐదేళ్లుగా 'స్వచ్ఛ భారత' పునర్ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరుపుతోంది. బహిరంగ స్థలాలలో మలమూత్ర విసర్జనకు స్వస్తి చెప్పడం, వీధులలోని చెత్తకుప్పలు తొలగించడం ఈ 'స్వచ్ఛ భారతం'లో రెండు ప్రధాన అంశాలు!– అని ప్రచారం జరిగింది, జరుగుతోంది! కానీ 'స్వచ్ఛత'ను ఎప్పటికప్పుడు భంగపరుస్తున్న మహావైపరీత్యం మద్యపానం!– అన్న కఠోర వాస్తవానికి మాత్రం ప్రచారం లేదు. ఆంగ్ల సంవత్సరాది కాని భారతీయ, జాతీయ సంవత్సరాదులు కాని శుభ సందర్భాలు! అందువల్ల 'సంవత్సరాది' సందర్భంగా కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేవారు స్వరూప స్వభావాలు స్వచ్ఛంగా ఉండాలన్నది తరతరాల భారత జాతీయ నీతి! కానీ మద్యం తాగి మత్తెక్కి, ఊగుతూ, తూగుతూ, జోగుతూ ఉన్నవారు ఈ 'స్వచ్ఛత'కు దూరంగా ఉంటున్నారు! సూర్యోదయం కంటె ముందు నిద్రలేచి, స్నానం చేసి ప్రకృతికి, భూమికి కృతజ్ఞతలు చెప్పడం అనాదిగా మన జీవనం! అందువల్ల నూతన సంవత్సరాది రోజున అయినా ఈ పద్ధతి పాటించడం కనీస ధర్మం.. భూమి, ప్రకృతి సకల జనులకు మాత్రమే కాదు, సకల ప్రాణి కోటికి జీవన అస్తిత్వాన్ని, అభ్యుదయాన్ని ప్రసాదిస్తుండడం ప్రత్యక్ష అనుభవం! భూమి మాతృదేశం.. ప్రకృతి జాతీయ సంస్కృతి! ప్రపంచంలోని ప్రతి దేశానికి వర్తిస్తున్న సనాతన సత్యం 'సనాతన సత్యం' అని అంటే 'శాశ్వత వాస్తవం'– ఆంగ్ల భాషలో 'ఎటర్నల్ ట్రూత్'– అని అర్థం. కానీ ఆంగ్ల సంవత్సరాది నాడు జనం అర్ధరాత్రి ఆరగిస్తున్నారు, మద్యం తాగుతున్నారు. మరికొందరు బరితెగించి "నోళ్లు ముక్కులు కార్చుకుంటూ" అశ్లీల పదజాలాన్ని ఆవిష్కరిస్తూ తందానలాడుతున్నారు, వీధుల పైకి వచ్చి మద్యం సీసాలను పగలగొట్టి ఇతరులపై దాడులు చేస్తున్నారు, పోలీసులను సైతం దూషించి దౌర్జన్యకాండకు పూనుకుంటున్నారు. ఇలా 'నిశాచర'– రాత్రి యందు సంచరించే పిశాచాల, రాక్షసుల– ప్రవృత్తికి "జనంలో దాదాపు సగం" లోనవుతుండడం "ఆంగ్ల సంవత్సరాది" వేళ ఆవిష్కృతవౌతున్న దృశ్యం. ప్రతి ఏటా ఇది పునరావృత్తం.. ఈ ఏడు కూడ!! ఇలా మద్యం మత్తెక్కినవారు రాత్రి మూడువంతులు ముగిసేవరకు వికృత విన్యాసాలు చేసి, అప్పుడు నిద్రలోకి జారుకుంటున్నారు, పగలు సగం గడిచేవరకు నిద్ర లేవరు!! ఇదంతగా భారతదేశపు భౌతిక స్వచ్ఛత భంగపడుతున్న తీరు! "బహిరంగ మలమూత్ర విసర్జన"కు స్వస్తి చెప్పించడమే భౌతిక స్వచ్ఛత కాజాలదు, మద్యం ఉత్పత్తి ప్రక్రియ, మద్యపాన ప్రక్రియ కూడ భౌతిక కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అందువల్ల 'ప్లాస్టిక్'తోపాటు మద్యాన్ని కూడ నిర్మూలించడం భౌతిక స్వచ్ఛతకు అనివార్యమన్న పాఠాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడైన గ్రహించ గలగాలి!! బిహార్ ప్రభుత్వం మద్యపానాన్ని, ఉత్పత్తిని నిషేధించింది. దీనివల్ల రాష్ట్రానికి రావలసిన ఆదాయం తగ్గిపోయినప్పటికీ, వేలాది 'మద్యం' అభియోగాలను విచారించి తీర్పులు చెప్పడం మరింత ఖర్చుతో కూడిన న్యాయ ప్రక్రియ అయినప్పటికీ బిహార్ ప్రభుత్వం భరించగలుగుతోంది. మూడేళ్లకు పైగా మద్యనిషేధం అమలు జరగడంవల్ల, ఉల్లంఘించిన "తాగుబోతుల"కు, ఉత్పత్తిదారులకు వ్యతిరేకంగా రెండు లక్షల అభియోగాలు వివిధ న్యాయస్థానాలలో విచారణ దశలో ఉన్నాయట. ఈ మూడున్నర ఏళ్లలో బిహార్ పోలీసులు ఆరు లక్షల చోట్ల దాడులు జరిపి యాబయి రెండు లక్షల 'లీటర్'ల మద్యాన్ని పట్టివేసి, ధ్వంసం చేశారట. స్వచ్ఛ భారత్ నిజంగా ఏర్పడాలంటే ఇదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మద్య నిషేధానికి నడుం బిగించాలి. గుజరాత్‌లో మాత్రమే చాలాకాలంగా మద్య నిషేధం అమలులో ఉందట! 2015 నుంచి కేరళ ప్రభుత్వం, 2017 నుంచి తమిళనాడు, గత ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మద్యం' ఉత్పత్తిని, పానాన్ని కొంతవరకు నియంత్రిస్తున్నాయి. కానీ మిగిలిన రాష్ట్రాల ప్రభుత్వాలు నడుములను బిగించడం లేదు. ఆంగ్ల సంవత్సర ప్రారంభ శుభవేళ.. ప్రతి సంవత్సరం మద్యం విక్రయాలు భయంకరంగా పెరిగిపోతున్నాయి, ఆదాయం పెరుగుతుందన్న భావంతో ప్రభుత్వాలు మురిసిపోతున్నాయి. హైదరాబాద్ మహానగరంలో మాత్రమే డిసెంబర్ 31వ తేదీన రెండు వందల పది కోట్ల రూపాయల విలువైన మద్యాన్ని తాగుబోతులు కొనేశారట. తెలంగాణలో అదే రోజున మూడువందల యాబయి కోట్ల రూపాయల విలువైన ఈ "తీయటి విషం" అమ్ముడుపోవడం మరో వాస్తవం...

నేటినిజం
బుధవారం 29-1-2020

మండలి రద్దు ఓ మంచి నిర్ణయం

హైదరాబాద్, జనవరి 28:రాజకీయ పునరావాసానికి కేంద్రంగా ఉన్న అన్ని వ్యవస్థలకు మంగళం పాడడం ద్వారా ప్రజల డబ్బులను ఆదాచేయాలి. వాటిని అభివృద్ధికి కేటాయించాలి. గతంలో ఎన్టీఆర్ కాలంలో రద్దు చేసిన మండలిని పునరుద్ధరించడమే తప్పు. పునరుద్ధరించిన మండలితో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. నేరుగా ఎన్నిక కాలేని వారిని మండలిలోకి తీసుకుని వచ్చే యత్నాలతో లాభం లేదని నిరూపితం అయ్యింది. ఇప్పుడు ఎపిలో వైకాపా సర్కార్ తీసుకున్న మండలి రద్దు నిర్ణయం నూటికి నూరుపాళు సరైన నిర్ణయంగా స్వాగతించాలి. కారణమేదైనా సమాజానికి పనికిరాని వ్యవస్థలను రద్దు చేయాల్సిందే. గవర్నర్ వ్యవస్థ కూడా ఇందులో ఉంది. జడ్పీటీసీ, ఎంపిటిసి లాంటి వ్యవస్థలను కూడా తొలగించాలి. ప్రజల డబ్బుతో రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను మేపడానికి ఉద్దేశించిన వ్యవస్థలను పెకిలించాలి. నిజానికి మండలితో వచ్చే ఉపయోగం లేదు. కొందరికి పదవులు కట్టబెట్టం మినహా ఎందుకూ పనికి రాదు. ఈ విషయంలో జగన్ బాటలో అన్ని రాష్ట్రాలు ముందుకు నడవాలి. కేంద్రం కూడా ఈ మండలి వ్యవస్థను రద్దు చేస్తే మంచిది. గవర్నర్,మండలి, జడ్పీటీసీ,ఎంపిటిసిలతో పాటు రాజకీయ పునరావసాలకు అవకాశం కల్పించే ఎలాంటి పదవును కూడా చేష్టకుండా చట్టాలుచేయాలి. అప్పుడే అభివృద్ధికి ఆస్కారం ఏర్పడు తుంది.

మండలి రద్దుపై టిడిపి మాట్లాడుతున్న తీరు దారుణం కాక మరోటి కాదు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తామంటున్న వారు మండలి రద్దు నిర్ణయాన్ని స్వాగతించాలి. చంద్రబాబు బృందం రెండునాల్కల ధోరణిని విడనాడాలి. కారణమేదైనా మండలి రద్దుకు జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతంగానే చూడాలి. తన పార్టీ వారికి పదవుల పందేరానికి అవసరమైన అవకాశం ఉన్నా దానిని తృణీకరించి ముందుకు సాగడం సరైన నిర్ణయం. మండలి రద్దు నిర్ణయంపై కేంద్రం ఏం చేయబోతున్నదో చూడాలి. తీర్మానాన్ని ముందు కేంద్రమంత్రివర్గం, అనంతరం పార్లమెంటు ఉభయసభలూ ఆమోదించిన పక్షంలో అది రాష్ట్రపతికి చేరి, అంతిమంగా చట్టం అవుతుంది. కేంద్రంలో మెజారిటీ పార్టీగా ఉన్న బిజెపి తక్షణమే ఇందుకు అనుగుణంగా స్పందించాలి. మరొకపక్క శాసనమండళ్ళకు సంబంధించి ఒక జాతీయస్థాయి విధానాన్ని తేవాలన్న ఆలోచనను కేంద్రం చేస్తే మంచిది. ఇకపోతే మండలి రద్దుపై చంద్రబాబు, ఆయన బృందం రెండునాల్కల ధోరణితో ఉన్నాయి. గతంలో రద్దుకు సై అన్నవారు ఇప్పుడు తమవారి రాజకీయ పునరావాసం పోతుందన్న బాధలో రద్దును వద్దంటున్నారు. శాసనమండలి ఉండాల్సిందేనని ఇప్పుడు చెబుతున్న ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, 2004లో మండలి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని స్పష్టంగా చెప్పారు. శాసనాలు ఆలస్యం అవుతాయని పేర్కొన్నారు. 2004 శాసనమండలి పునరుద్ధరణ బిల్లును వ్యతిరేకిస్తూ చంద్రబాబు అప్పుడు మాట్లాడారు. అప్పుడోమాట ఇప్పుడో మాట సరికాదు. శాసనమండలి పునరుద్ధరించాలనే నిర్ణయం వల్ల కాంగ్రెస్ కొంతమందికి రాజకీయ పునరావాసం కల్పిస్తారేమో గానీ.. దీనివల్ల రాష్ట్రానికి, ప్రజలకు ఏం లాభం లేదని ఆనాడు వ్యాఖ్యానించారు. శాసన మండలికి మేధావులను పంపడం ద్వారా వివిధ అంశాలను చర్చించాలన్న ఉద్దేశం ఉండేది. అయితే దానివల్లా ప్రయోజనం లేదని తేలింది. ఇకపోతే 1934 అక్టోబర్ 26న బాబూ రాజేంద్రప్రసాద్ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ, దీనివల్ల ఏమాత్రం లాభం ఉండదని, నష్టం ఉంటుందని, ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, శాసనాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పారు. 1950 నుంచి చూస్తే... 8 రాష్ట్రాల్లో మాత్రం రెండు సభలొచ్చాయి. కాలక్రమేణా మూడు రాష్ట్రాల్లో రద్దయ్యి ఐదు రాష్ట్రాల్లో మాత్రం మండలి ఉంది. మండలి వల్ల రూ.20 కోట్లు ఆర్థిక భారం పడుతుంది. బిల్లుల ఆమోదంలో కాలయాపన జరుగుతుందని ఆనాడు చంద్రబాబు అంగీకరించారు. అసెంబ్లీ నుంచి ఒక బిల్లు పంపిస్తే అక్కడికి పోవడం, తిరిగొస్తే మళ్లీ చర్చించడంతో కాలయాపన జరుగుతూ వచ్చింది.

ఆర్థిక సంబంధమైన బిల్లుల విషయంలో మండలికి పటిష్టమైన అధికారాలు లేవు. ఈ బిల్లులన్నీ శాసనసభే ఆమోదిస్తుంది. ఏదైనా బిల్లును చట్టం కాకుండా అడ్డుకునే శక్తి మండలికి నాలుగు నెలలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత దానంతట అదే చట్టమవుతుంది. ఏవైనా రాజ్యాంగ సవరణలు చేయాల్సి వస్తే అసెంబ్లీ తప్ప మండలికి ఏమాత్రం అధికారం లేదు. ఆఖరుకు రాష్ట్రపతి ఎన్నికల విషయంలోనూ మండలి సభ్యులకు ఓటింగ్ హక్కు లేదు. పరిమిత అధికారాలు తప్ప ఏమీ మండలికి ఉండవు. ప్రజాధనం దుర్వినియోగం చేసే మండలి బిల్లు వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. ఇకపోతే ఎంపిటిసిలు,జడ్పీటిసిలు కూడా అలాగా మారాయి. రాజకీయ పునరావాసానికి ఈ పదవులు వచ్చాయి. వీరికి చట్టబద్ధమైన హక్కులు లేవు. అందువల్ల ఇలాంటి పదవులకుమంగళం పాడాల్సిన అవసరం ఉంది. ఎపి మండలి రద్దు నేపథ్యంలో సర్వత్రా ఇప్పుడు ఇలాంటి ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న పదవులపై చర్చ సాగాలి. అలాగే అదేపనిగా ప్రభుత్వం సలహాదారులను నియమించు కుంటోంది. ఇలాంటి చర్యలను కూడా అంతా వ్యతిరేకించాలి. దీనిపై కేంద్రమే ఓ నిర్ణయం తీసుకోవాలి. ప్రజాధనం వృధా అవుతున్న అనేక సంస్థలను తుదముట్టించాలి. ఆర్థిక మాంద్యానికి, విపరీత ఖర్చులకు కళ్లెం వేయాలి. సిఎంలు వారి ఇష్టానుసారం ఖర్చుచేసే పద్ధతికి కూడా స్వస్తి పలకాలి. పాలనంటే కేవలం రాజకీయాలు, వ్యక్తులకు పదవులుఉల ఇవే కాదని గుర్తించాలి. అప్పుడే భారతదేశం ముందుకు వెళ్లగలదు.

భారీగా ఖర్చు చేసినా దక్కని విజయం

ఆందోళనలో ఓడిన అభ్యర్థులు
అప్పులు తీర్చే మార్గం ఎలా అన్న భయం

నిజామాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బరిలో దిగిన అభ్యర్థుల్లో ఓటమిపాలైన వారు ఓటమిని ఏమాత్రం జీర్ణించుకోలేకపోతురు. ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బరిలో నిలిచిన వీరంతా గెలుపువట్ల అనేక ఆశలు పెట్టుకున్నారు. తీరా ఫలితాలు తమకు వ్యతిరేకంగా రావడంతో ఓటమిని తట్టుకోలేకపోతున్నారు. ప్రచారంలో తమకు అనుకూలంగా ఉన్న వారు ఎందుకు ఓట్లు వేయలేదని, ఎక్కడ లోపం జరిగిందని చర్చిస్తున్నారు. కొందరు అభ్యర్థుల మాదిరిగా మద్యం పంపిణి చేశామని, నోట్లు వెదజల్లామని, హామీలను కూడా ఇచ్చామని అయినా లోపం ఎక్కడ జరిగిందంటూ వాపోతున్నారు. తిరిగి ఎన్నికలు 5సంవత్సరాల వరకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో మరో 5 సంవత్సరాలు వేచి చూడాలన్న ఆందోళనలో ఉన్నారు. ఖర్చులను ఎలా తేర్చాలన్న ఆందోళనలో ఉన్నారు. జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌లుగా గెలిచినవారికి తీపిని అందిస్తే, ఓటమిపాలైన అభ్యర్థులకు మాత్రం చేదును మిగిల్చాయి. గెలిచినవారు ఇంకా సంబురాల నుంచి తేరుకోలేకపోతుంటే, ఓటమిపా లైన వారికి మాత్రం నిద్ర పట్టడం లేదు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని బరిలో దిగిన కౌన్సిలర్ అభ్యర్థులు ఖర్చుకు ఏ మాత్రం వెనకాడకుండా ముందుకు సాగారు. ఎన్నో ఆశలతో ఎన్నికల బరిలో దిగితే ఫలితాలు మాత్రం వ్యతిరేకంగా రావడంతో ఓటమిని తట్టుకోలేక పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన కౌన్సిలర్ అభ్యర్థులు ఆ పదవి కోసం అనేకం అప్పులు చేసినట్లు తెలుస్తోంది. గొప్పలకు పోయిన అభ్యర్థులు బరిలో దిగిన నాటినుంచి పోటీ నువ్వా, నేనా అన్నట్లుగా సాగడంతో చేసేదేమీ లేక ఖర్చుకు వెనకాడలేదని ఎన్నికల సరళిని చూస్తే తెలుస్తోంది. ఎల్లారెడ్డి మున్సిపాల్టీ బరిలో దిగిన ఓ స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం తన పంట పొలాన్ని తాకట్టు పెట్టుకున్నట్లు సమాచారం. ఇదే మున్సిపాల్టీ పరిధిలోని ఓ అభ్యర్థి వార్డు ప్రజల కోరిక మేరకు కాలనీలో ఎల్లమ్మ ఆలయం నిర్మాణం కట్టి ఇస్తానని హామీనిచ్చారు. గెలుపు కోసం పంటపొలాలు ఉన్న వారు ఏకంగా తమ పొలాలను తాకట్టు పెట్టుకోగా, ఇంకొంతమంది ఎకరం, అరెకరం విక్రయించుకోవడం గమనార్హం. పట్టణాలలో గెలుపు ప్రతిష్టాత్మకం కావడంతో అప్పులు చేశారు. ఓటుకు ఏకంగా వెయ్యి మొదలుకొని రూ. 3వేల వరకు ఖర్చు చేశారంటే పరిస్థితి ఇట్టే అర్థమౌతుంది. ముఖ్యంగా మున్సిపాల్టీల పరిధిలోని అనేక వార్డుల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు కొంతమేర పలుకుబడి ఉన్నప్పటికీ డబ్బు కూడా కీలకమైంది. వీటికి తోడు విచ్చలవిడిగా పంపిణీ చేసిన మద్యం కూడా అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడు చేసింది. అభ్యర్థులు నామినేషన్ల నుంచి ప్రతీరోజు తప్పనిసరి పరిస్థితుల్లో మద్యాన్ని ఏరులై పారించారు. మద్యం పంపిణీ చేయడం కోసం అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు. విందులు భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల నుంచి వలసలు వెళ్లిన వారిని రప్పించడం కోసం వాహ నాలు సమకూర్చి, వారికి విందు ఇచ్చి ఓటుకు సుమారుగా రూ. 1500 వరకు చెల్లించిన అభ్యర్థులు ఓట్లు పెట్టించుకొని తిరిగివచ్చారు. ఇలా మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన వారు తమ గెలుపు కోసం అయ్యే ఖర్చును అప్పు తీసుకువచ్చి ఖర్చు చేయడంతో పోటీ తీవ్ర రసవత్తరంగా సాగింది. గెలిచిన వాళ్లు ఎలాగైన అప్పులు తీర్చు కుందామని ఆలోచనలో ఉన్నప్పటికీ, ఓడిన వారు మాత్రం ఓటమితో పాటు మిగిలిన అప్పును ఎలా తీర్చాలోనని ఆవేదనతో ఉన్నారని తెలుస్తోంది.

సిరిసిల్ల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

మంత్రి కెటిఆర్ మార్గదర్శకత్వంలో పట్టణాభివృద్ధి
మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి

సిరిసిల్ల,జనవరి28(ఆర్ఎన్ఎ): సిరిసిల్ల పట్టణాభివృద్ధికి మంత్రి కేటీఆర్ మార్గదర్శనలో అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి అన్నారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంతో నమ్మకంగా తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తోపాటు సహకరించిన టీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిపాలనకు టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అవకాశం కల్పించిన టీఆర్ఎస్ శ్రేణులకు, సహకరించిన ప్రజలకు పార్టీ రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయిలో పురపాలక సంఘంలో మార్పు కోరుకున్నారని తెలిపారు. అధికారులతో ఉండి అభివృద్ధిని చేస్తామని, ఇచ్చిన మాటను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా గొప్పదని అభివర్ణించారు. పురపాలక శాఖమంత్రి కేటీఆర్ సారథ్యంలో విలీన గ్రామాలతో పాటు పట్టణాన్ని వచ్చే ఐదేళ్లలో అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు శ్రాయశక్తులా కృషిచేస్తామన్నారు. ప్రతిపక్షాలను మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, అర్థం లేని ఆరోపణలు, అవినీతితో కూడిన ఎత్తుగడలు ఇక మీద పనికిరావని హితవుపలికారు.అపూర్వమైన తీర్పును అందించిన ప్రజలందరికీ మన స్ఫూర్తిగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని స్పష్టంచేశారు.బల్దియాపై గులాబీ జెండా ఎగరడంతో గులాబీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ప్రత్యేక వాహనంపై వార్డులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు పాలకవర్గానికి దండాలతో అభినందించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళచక్రపాణి, వైస్ చైర్మన్‌గా మంచె శ్రీనివాస్, వేములవాడలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్‌గా మధు రాజేంద్రశర్మ ఎన్నికయ్యారు. పార్టీ నాయకులు ముందే వీరిని గుర్తించి కెటిఆర్‌కు వివరించి అనుమతి పొందారు. రెండు మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక లాంఛనంగానే ముగిసినప్పటికీ వేములవాడలో చైర్మన్, వైస్‌చైర్మన్ సిరిసిల్లలో వైస్ చైర్మన్ ఎంపికకు ఓటింగ్ జరగడంతో ఉత్కంఠగా మారింది. సిరిసిల్ల మున్సిపాలిటీలో 39 వార్డులకు 22 మంది టీఆర్ఎస్ కౌన్సిలర్లు, 12 మంది స్వతంత్రులు మున్సిపల్ వైస్ చైర్మన్ టీఆర్ఎస్ అభ్యర్థి మంచె శ్రీనివాస్‌కు ఓటు వేశారు. మంచె శ్రీనివాస్‌కు 34 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి బొల్గం నాగరాజుకు బీజే పీ చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే ఓటు వేశారు. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఓటింగ్‌కు దూరమున్నారు. దీంతో టీఆర్ ఎస్‌కు చెందిన మంచె శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయినట్లు ప్రకటించారు.వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పేరును టీఆర్ఎస్ నాయకత్వం సీల్డు కవరులో పంపించడంతో మున్సిపల్ అధ్యక్ష పీఠం ఎవరిని వరిస్తుందో అన్న అంశం చివరివరకు ఉత్క ంఠగా మారింది. 16వవార్డు కౌన్సిలర్ కొండ శ్రీలత, 9వవార్డు కౌన్సిలర్ రామతీర్థపు మాధ విలో ఒకరికి చైర్‌పర్సన్ స్థానం దక్కుతుందని తొలినుంచి ఊహాగానాలు వినిపించినా ఇద్దరిలో ఎవరికి అవకాశం దక్కుతుందోనని చివరి వరకు ఎదురుచూడాల్సి వచ్చింది.సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల పక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఇందుకు సహకరించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కృష్ణభాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు.

బొంగుల విజయలక్ష్మి హ్యాట్రిక్

–వరుసగా మూడోసారి పీఠం కైవసం

సంగారెడ్డి,జనవరి28(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి గ్రేడ్‌వన్ పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బొంగుల విజయలక్ష్మి ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. వరుసగా మూడుసార్లు చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బొంగుల విజయలక్ష్మి, సంగారెడ్డి మున్సిపల్ చరిత్రలో కొత్త రికార్డును సాధించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్స్‌సగా 31వ వార్డు నుంచి గెలుపొందిన శంకరి లతా విజయేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కొత్త కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక ఆద్యంతం ప్రశాంత వాతావరణంలో జరిగింది.

బల్దియాలో మొత్తం 38 వార్డులకు, 18 వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు, 12 వార్డుల్లో కాంగ్రెస్, మూడు వార్డుల్లో బీజేపీ, రెండు వార్డుల్లో ఎంఐఎం అభ్యర్థులు గెలుపొందగా మూడు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. అయితే టీఆర్ఎస్ నుంచి 18 మంది కౌన్సిలర్లు గెలవగా, ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లతో పాటు ఇద్దరు ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతుతో సంగారెడ్డి మున్సిపల్ పీఠాన్ని టీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ నుంచి 22వ వార్డు నుంచి గెలుపొందిన తూర్పు నిర్మలారెడ్డిను చైర్‌పర్సన్ అభ్యర్థిగా 12వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి ప్రతిపాదించగా, 33వ వార్డు కౌన్సిలర్ నాగరాజు బలపరిచారు. బొంగుల విజయలక్ష్మికి మొత్తం 23 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తి మద్దతు పలికారు. వీరిలో 18 మంది టీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు ఎంఐఎం, ముగ్గురు స్వతంత్రులు ఉన్నారు. ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు తటస్తంగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీపడిన తూర్పు నిర్మలకు 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్దతు పలికిన బలాన్ని నిరూపించుకోలేకపోయారు.

మేడారానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): మేడారం సమక్క, సారక్క జాతరకు ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 6 డిపోల నుంచి 304 బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ అన్నారు.

గత జాతరకు 68వేల మంది భక్తులు ఆర్టీసీ సేవలు వినియోగించుకున్నారని, ఈ మేరకు 80 వేల మంది భక్తులను సరిపడా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 55 కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిని చెన్నూర్ నుంచి మేడారం వరకు నడపుతామన్నారు. ఆసిఫాబాద్ నుంచి మొత్తం 65 బస్సులు కేటాయించగా.. ఆసిఫాబాద్ నుంచి 10, బెల్లంపల్లి నుంచి 55 బస్సులు నడుపుతామన్నారు. భైంసా డిపో 35 బస్సులను సిర్పూర్ నుంచి, నిర్మల్ డిపో 52 బస్సులను మందమర్రి నుంచి, మంచిర్యాల డిపో నుంచి 97 బస్సులను నడుపుతున్నామని వెల్లడించారు. ప్రైవేటు వాహనాలు ఆలయం దగ్గరకు చేర్చవని, సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఆగుతాయని, ఆర్టీసీ బస్సులైతే ఆలయం వరకూ వెళ్తాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకుని సమ్మక్క, సారలమ్మ కృపకు పాత్రులు కావాలన్నారు.

మున్సిపాలిటీలన్నీ టీఆర్ఎస్ వశం

పావులు కదిపిన ఎమ్మెల్యే దాసరి
అనుకున్న వారికి పదవులు వచ్చేలా వ్యూహం

పెద్దపల్లి,జనవరి28(ఆర్ఎన్ఎ): ఊహించినట్లుగానే జిల్లాలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సహా పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు టీఆర్ఎస్ పార్టీ వశ మయ్యాయి. రామగుండంలో టీఆర్ఎస్‌కు మెజారిటీ లేకున్నా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, స్వతంత్రులు, ఇద్దరు బీజేపీ కార్పొరేటర్ల మద్దతుతో మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కైవసం చేసుకున్నది. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ ఉన్నా పార్టీలోనే కోవర్టు జరగవచ్చని భావించిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్ల మద్దతును కూడగట్టడంతో అక్కడ పార్టీ గట్టెక్కింది. ఈరామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లకు గాను టీఆర్ఎస్ 18 డివిజన్లలో గెలుపొందగా, 11 డివిజన్లలో కాంగ్రెస్, 6 డివిజన్లలో బీజేపీ, 9 డివిజన్లలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, 6 డివిజన్లలో స్వతంత్రులు గెలుపొందారు. మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు కావాల్సిన మెజారిటీ టీఆర్ఎస్‌కు లేకపోవడంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డితో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంతనాలు జరపడంతో ఆయన ఆ పార్టీ నుంచి గెలుపొందిన ఫలానా వారికి ఓటు వేయాలని విప్ జారీ చేయలేదు. వారితో పాటు ఆరుగురు స్వతంత్రులు, బీజేపీ నుంచి గెలుపొందిన వారిలో 43వ డివిజన్ కార్పొరేటర్ ధరణి స్వప్న, 48వ డివిజన్ నుంచి గెలుపొందిన పొన్నం విద్య టీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలికారు. 35 మంది కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యే ఎన్నికకు హాజరు కాగా, మేయర్‌గా 30వ డివిజన్ నుంచి గెలుపొందిన డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్‌గా 4వ డివిజన్ నుంచి గెలుపొందిన అభిషేక్‌రావు ఎన్నికయ్యారు. కాంగ్రెస్, బీజేపీ కార్పొరేట ర్లు గైర్హాజరు కావడంతో ఎన్నిక ఏకపక్షంగా సాగింది. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోడలు 21వ వార్డు కౌన్సిలర్ చిట్టిరెడ్డి మమత చైర్మన్‌గా ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా 36వ వార్డు కౌన్సిలర్ నాజిమ్ సుల్తానా

తుక్కుగూడాలో బిజెపి ఆందోళన

వీరేందర్ గౌడ్ అరెస్ట్..టిఆర్ఎస్ వశం అయిన చైర్మన్

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): బిజెపి నేత వీరేందర్ గౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా టీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో బీజేపీకి క్లీన్ మెజార్టీ ఉన్నా టీఆర్ఎస్ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు చూస్తోందని ఆరోపించారు. ఐదు ఎక్స్ అఫీషియో ఓట్లతో తుక్కుగూడలో గెలవాలని చూస్తున్న టీఆర్ఎస్ కు వ్యతిరేకంగా బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా తుక్కుగూడ మున్సిపాలిటీ ముందు వీరేందర్ గౌడ్ ధర్నాకు దిగడంతో.. అరెస్ట్ చేసి పీఎస్ కు తరలించారు. అయితే ఇక్కడ టిఆర్ఎస్ ఖాతాలోకి అధికారపీఠం వెళ్లింది. తీవ్ర ఉత్కంఠ రేపిన తుక్కుగూడ మున్సిపాలిటీని అనూహ్య పరిణామాల నడుమ టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మంత్రి సబితా ఇంద్రారెడ్డి సొంత నియోజకవర్గమైన మహేశ్వరంలో కీలకమైన తుక్కుగూడ మున్సిపాలిటీలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడం టీఆర్ఎస్ కు షాక్ ఇచ్చింది. తుక్కుగూడ మున్సిపాలిటీలో 15 వార్డుల్లో బీజేపీ 9, టీఆర్ఎస్ 5 గెలుచుకోగా, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. బీజేపీకి మెజారిటీ వచ్చినప్పటికీ తగినంతమంది ఎక్స్ అఫీషియో ఓట్ల మద్దతు లేకపోవడంతో రెండో వార్డులో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి కాంటేకర్ మధుమోహన్ కీలకంగా మారారు. ఈ క్రమంలో తగినంత ఎక్స్ అఫీషియో ఓట్లను కూడగట్టడంతోపాటు యువనేత మధును సబిత టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అంతేకాకుండా బీసీ వర్గానికి చెందిన మధుకు తుక్కుగూడ మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్ పదవిని అప్పగించారు. బీజేపీ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ తనకు కీలకమైన తుక్కుగూడ మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారు.

అధికారపార్టీ అనైతిక చర్యలు

-కెసిఆర్ తీరుపై మండిపడ్డ లక్ష్మణ్

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అనైతిక చర్యలకు పాల్పడుతోందని బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. మెజారిటీ లేని స్థానాల్లో కూడా టీఆర్ఎస్ దొడ్డి దారిన చైర్మన్ పదవులను చేజిక్కించుకోవాలని చూస్తోందన్నారు. ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తోన్న కేకే.. తెలంగాణలో ఎక్స్ అఫీషియో మెంబెర్‌గా ఎలా చెల్లుబాటవుతారని లక్ష్మణ్ ప్రశ్నించారు. తెలంగాణలో జనసేనతో కలిసి పనిచేస్తామని బీజేపీ నేత లక్ష్మణ్ వెల్లడించారు. త్వరలో పవన్ కల్యాణ్‌తో సమావేశమవుతామని లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ అన్ని అడ్డంకులను ఎదుర్కొని మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిందని .లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం వివక్ష చూపడం లేదని, తెలంగాణకు రావాల్సిన నిధులను ఇస్తోందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ అవకాశవాద రాజకీయ వాదులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

దేశమంతా రైల్వేల విద్యుద్దీకరణ: పీయూష్ గోయల్

న్యూఢిల్లీ,జనవరి28(ఆర్ఎన్ఎ): డీజిల్ లోకో షెడ్‌లను త్వరలో సంపూర్ణంగా మూసివేయనున్నామని, 2024 కల్లా దేశమంతా విద్యుద్దీకరణ పూర్తి అవుతుందని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. దీంతో దేశమంతా విద్యుత్‌తో నడిచే తొలి రైల్వే నెట్వర్క్ ప్రపంచంలో మనదే కానున్నట్లు మంత్రి చెప్పారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని రైల్వే లైన్ల విద్యుద్దీకరణ వేగవంతం చేశామన్నారు. ఢిల్లీలో జరిగిన ఇండో-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్‌లో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 2030 కల్లా నెట్ జీరో ఎమిషన్ నెట్వర్క్‌గా రైల్వే వ్యవస్థను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మౌళికసదుపాయాల అభివృద్ధిపై బ్రెజిల్‌తో కలిసి పనిచేయనున్నట్లు మంత్రి చెప్పారు.

వాహనాల సంఖ్య పెరగడంతో ప్రమాదాలు

-రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మంత్రి పువ్వాడ

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): సమాజంలో వాహనాలు, జనాభా సంఖ్య పెరిగడంతో విపరీతంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. వాహనాలు నడిపేప్పుడు రోడ్డు భద్రత జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర రవాణాశాఖ చేపట్టిన రోడ్డు భద్రతా వారోత్సవాలను సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకూ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇక్కడి హెచ్ఎండిఏ మైదానంలో జరిగిన కార్యక్రమంలో సినీనటి ఈషారెబ్బ కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పువ్వాడ హెల్మెట్ ధరించి మోటార్‌సైకిల్ నడిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వాహనాలు, జనాభా సంఖ్య పెరిగడంతో విపరీతంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. కారు తదితర వాహనాలు నడిపితే నడిపేవారితో ఎదుటి వారికి సైతం ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ప్రయాణాల్లో అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా వ్యవహరించాలని సూచించారు.

ఆ చట్టాలను బెంగాల్ అమలు చేయదు

-తీర్మానాన్ని ఆమోదించిన బెంగాల్ అసెంబ్లీ

కోల్‌కతా,జనవరి28(ఆర్ఎన్ఎ): సీఏఏ, ఎన్నార్సీ, ఎన్ పీ ఆర్ చట్టాలను తమ రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. వివాదాస్పదమైన సీఏఏను వ్యతిరేకిస్తూ.. బెంగాల్ అసెంబ్లీ సోమవారం తీర్మానాన్ని ఆమోదించింది. దీంతో కేరళ, పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాల తరువాత వెస్ట్ బెంగాల్ దీన్ని వ్యతిరేకించిన నాలుగో రాష్ట్రమైంది. ఈ చట్టాన్ని నిరసిస్తూ సాగిన ర్యాలీలకు ముందుండి నడిపించిన మైనారిటీలకే కాక.. హిందూ సోదరులకు కూడా తాము కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆమె అసెంబ్లీలో పేర్కొన్నారు. 'సీఏఏ అంటే ఓ ' నిర్వచనాన్ని' కూడా దీదీ వివరించారు. ఈ చట్టం ప్రకారం.. ఈ దేశ పౌరుడు కావాలంటే ఒకరు ' విదేశియుడు' కావాలి.. ఇది దారుణమైన గేమ్.. మృత్యువుకు ప్రజలను దగ్గర చేయడమే.. దయ చేసి వారి (బీజేపీ)వలలో పడకండి' అని మమత అన్నారు. ఈ చట్టాలపై తాము శాంతియుతంగా పోరాడుతామని ఆమె చెప్పారు. బీజేపీని మమత.. పాకిస్తాన్ 'బ్రాండ్ అంబాసిడర్' గా అభివర్ణించారు. వారు హిందూస్తాన్ గురించి కన్నా పాకిస్తాన్ గురించి ఎక్కువగా మాట్లాడుతారని ఆమె సెటైర్లు వేశారు. మొదట కేరళ అనంతరం.. కాంగ్రెస్ పాలిత పంజాబ్ ప్రభుత్వం, అనంతరం ఇదే పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్ సర్కార్ కూడా సీఏఏని వ్యతిరేకిస్తూ తీర్మానాలను ఆమోదించిన సంగతి విదితమే. ఇక బీహార్ సీఎం నితీష్ కుమార్ కూడా ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేసే యోచనే లేదని ప్రకటించారు. అటు-సీఏఏకు తాము కూడా వ్యతిరేకమని తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం ఇటీవల ప్రకటించారు. తమ టీఆర్ఎస్ పార్టీ లౌకికవాద పార్టీ అని ఆయన స్పష్టం చేశారు.

అధికార పార్టీకి ఎప్పుడూ అడ్వాంటేజే

-మున్సిపల్ ఫలితాలపై డికె అరుణ

నారాయణపేట,జనవరి28(ఆర్ఎన్ఎ): మక్తల్, నారాయణపేటలో బీజేపీకి గట్టి పట్టు ఉందని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. అందుకే మక్తల్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని సోమవారం బీజేపీ కైవసం చేసుకుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవడం సహజమన్నారు. సీఎం కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల ముందు బీజేపీ గెలిచే స్థానాల్లో ముస్లింల ఓట్లు రాబట్టుకునేందుకు.. ఎన్ఆర్‌సీ, సీఏఏల పేరు తప్పుడు ప్రచారం చేయడానికి ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు దేశం గురించి గాని, దేశ భద్రత గురించి అవసరం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఎన్ఆర్‌సీ చట్టం తీసుకుచ్చిన తర్వాత ముస్లింల గురించి మాట్లాడున్నాడంటే కేసీఆర్ ఎంత నమ్మక ద్రోహి అనేది ముస్లింలు గమనించాలి. బైంసా సంఘటన జరిగినప్పుడు సీఎం కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని అరుణ ప్రశ్నించారు. ప్రజలు తలలు పగలగొట్టుకున్నా, చచ్చినా తనకు సంబంధం లేనట్లు వ్యవహరించారని ఆమె ధ్వజమెత్తారు. అప్పుడు నోరుమెదపని కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తర్వాత ఎందుకు మాట్లాడారని అరుణ సూటిగా ప్రశ్నించారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ,కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు

అపవిత్ర పొత్తు పెట్టుకున్న రెండు పార్టీలు
ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
గెలుపొందిన వారికి మున్సిపల్ చట్టాలపై శిక్షణ
ప్రణాళికబద్ధమైన పట్టణాభివృద్ధికి కృషి
మీడియా సమావేశంలో కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేశాయని మంత్రి కేటీఆర్ విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మక్తల్, మణికొండ, తుర్కయంజాల్‌లో బీజేపీ-కాంగ్రెస్ అపవిత్ర పొత్తు పెట్టుకున్నాయని ఆరోపించారు. పేరుకు మాత్రం ఢిల్లీ పార్టీలని, చేసేవి గల్లీ రాజకీయాలని మంత్రి విమర్శించారు. మేడ్చల్, నేరేడుచర్లలోనూ తమకు సంపూర్ణ మెజార్టీ ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. 120 స్థానాల్లో 112 స్థానాలను టీఆర్ఎస్ సాధించిందని, పదికి పది కార్పొరేషన్లు గెలవడం అనితరసాధ్యమని మంత్రి అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు టీఆర్ఎస్‌నే గెలిపించారని, దేశానికే ఆదర్శవంతమైన పట్టణాలను తయారు చేస్తామని కేటీఆర్ స్పష్టం చాశారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు పార్టీలకతీతంగా శిక్షణ ఇస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. అర్బన్ సెంటరాఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రూ.1,037 కోట్లు కేంద్రం నుంచి వస్తే..అంతే మొత్తంలో రాష్ట్రం నుంచి కేటాయిస్తామని చెప్పారు. మున్సిపాలిటీల్లో జవాబుదారీ తనాన్ని తీసుకొస్తామన్నారు. అన్ని మున్సిపాలిటీ ల్లో డిజిటల్ డోర్ నెంబర్లు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అపూర్వమైన విజయం అందించినందుకు తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్. ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేశారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంపై ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనవన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ అయిన టీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పొత్తు పెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ పార్టీలు పేరుకే జాతీయ పార్టీలని చేసేది నిల్లీ పనులని ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు ఒకే తాను ముక్కలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలోనే తాము చెబుతూ వచ్చామని, ఇప్పుడు చైర్మన్ ఎంపిక టైంలో ఆ పార్టీల అపవిత్ర పొత్తు బయటపడిందని అన్నారు. ఢిల్లీలో ఎప్పుడూ కొట్టుకునే ఆ పార్టీలు మున్సిపాలిటీల కోసం కలిసిపోయాయన్నారు. బ్రహ్మంగారు చెప్పిన వింతలు ఇవేనేమో అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. కొత్త మున్సిపల్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. పనులు చేయకపోతే పదవులు పోతాయన్న మాటకు కట్టుబడి ఉన్నామని, గెలిచింది తమవారే అయినా ప్రజలకు మంచి చేయకపోతే చర్యలు తప్పవని అన్నారు. కొత్త మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. ఇంటిపన్ను విషయంలో కొత్త విధానం తీసుకుని వస్తామన్నారు. అలాగే అక్రమ కట్టడాల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు మంత్రి కేటీఆర్. ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై మీడియా ప్రశ్నించగా అలాంటిదేమీ లేదన్నారాయన. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని చెప్పారు. చట్టం ప్రకారం ఉన్న హక్కునే తాము వినియోగించుకున్నామని తెలిపారు.

ఎక్స్ అఫీషియో చట్టబద్ధం

మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల విషయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యుల ఎక్స్‌అఫీషియో ఓటు హక్కు వినియోగంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సవివరంగా సమాధానం ఇచ్చారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటింగ్ విధానం తాము తీసుకువచ్చింది కాదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎక్స్‌అఫీషియో మెంబర్స్ అనే చట్టాన్ని తాము తీసుకురాలేదన్నారు. 1999లో నాటి టీడీపీ ప్రభుత్వం.. ఎమ్మెల్యేలకు ఎక్స్‌అఫీషియో ఓటు హక్కు కల్పించింది. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీలకు ఎక్స్‌అఫీషియో ఓటు హక్కు కల్పించింది అని కేటీఆర్ గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు తెచ్చిన చట్టాన్నే తాము వినియోగించుకున్నాం. ఓటు హక్కు వినియోగించుకోవడం అనేది చట్టం కల్పించిన హక్కు. ఆ హక్కును తాము వినియోగించుకున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఉన్న చట్టం ప్రకారం ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓట్లు ఉన్నాయి. తామేం ఆ చట్టాన్ని మార్చలేదు. రాజ్యసభ సభ్యులు ఎక్కడైనా ఓటేయొచ్చు. శాసనసభ సభ్యుల కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీలు కూడా ఎక్కడైనా ఓటేయొచ్చు. దాని ప్రకారమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అని కేటీ ఆర్ తెలిపారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో సహకరించిన ఎంఐఎంకు ధన్యవాదాలు చెప్పారు కేటీఆర్. పార్టీ రెబల్స్ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తున్నాం. టీఆర్ఎస్ దెబ్బకు పరస్పర విరుద్ధమైన పార్టీలు కలిసిపోయాయి. ఏ పార్టీ ఎవరికి బి-టీమ్ అనేది ఇవాళ ప్రజలకు అర్థమైంది అని కేటీఆర్ అన్నారు.

పట్టణాల్లో ప్రణాళికబద్ధ అభివృద్ధి

పట్టణాల్లో ప్రణాళికబద్ధమైన ప్రగతికి కృషి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందించిన ప్రజలకు జేజేలు తెలిపారు కేటీఆర్. 127 మున్సిపాలిటీల్లో 119 మున్సిపాలిటీలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ప్రత్యర్థులకు అందనంత దూరంలో అగ్రభాగాన నిలిచింది టీఆర్ఎస్ పార్టీ అని ఆయన తెలిపారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యావంతులకు, మేధావులకు, ప్రజలకు వినయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా విశ్వసించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణలో పట్టణీకరణ చాలా వేగంగా జరుగుతుంది. 43 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తాం. ఇంత పెద్ద మెజార్టీని ఇచ్చినందుకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి తీరుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈరాష్ట్రం ఏర్పడక ముందు 68 మున్సిపాలిటీలు ఉండేవి. ఈ రోజు మున్సిపాలిటీల సంఖ్య 141కి చేరింది. తెలంగాణ రాష్ట్రం రాక ముందు 6 కార్పొరేషన్లు ఉంటే.. ఇప్పుడు 13 కార్పొరేషన్లు ఉన్నాయి. జనాభా ప్రతిపాదికన శాస్త్రీయంగా ముందుకు వెళున్నాం. పట్టణాల్లో ప్రణాళికబద్ధమైన ప్రగతి ఉండాలనే ఉద్దేశంతో కొత్త మున్సిపల్ చట్టం తీసుకువచ్చాం. త్వరలోనే ప్రతి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి కార్యక్రమం అమలు చేస్తాం. కొత్తగా ఎంపికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు మున్సిపల్ చట్టంపై శిక్షణ ఇస్తాం. అర్బన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని కూడా ఏర్పాటు చేసుకోబోతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మున్సిపాలిటీలకు రూ.2,074 కోట్లు రానున్నాయి. నిధులు సమకూర్చి మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం. కొత్త మున్సిపల్ చట్టం పౌరుడి కేంద్రంగా రూపొందించాం. అవినీతికి ఆస్కారం లేకుండా భవన నిర్మాణ అనుమతులు ఇస్తాం. ప్రతి డివిజన్ లేదా వార్డులో నాలుగు కమిటీలు వేయబోతున్నాం. ఒకటి యూత్ కమిటీ, రెండోది వుమెన్ కమిటీ, మూడోది సీనియర్ సిటిజన్ కమిటీ, నాలుగోది రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీలను ఏర్పాటు చేస్తాం. మున్సిపాలిటీల్లో జవాబుదారితనం తీసుకువచ్చేందుకు గట్టిగా ప్రయత్నం చేస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి 21 రోజుల్లో అనుమతులు ఇస్తాం. అన్ని మున్సిపాలిటీల్లో డిజిటల్ డోర్ నంబర్ల విధానం తీసుకువస్తాం. వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ఇస్తాం. మున్సిపాలిటీల్లో అన్ని సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లోనే ఇస్తాం. అక్రమ లేఔట్లు, అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. నోటీసులు ఇవ్వకుండానే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం. అక్రమ నిర్మాణాలకు సహకరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మీడియా సమావేశంలో మంత్రి తలసాని, మేయర్ బొంతు రామ్మోమన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పిందే మేం చేస్తున్నాం

సిద్ధాంతపరంగా మండలి వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం
పునరావాస కేంద్రంగా మారిన మండలి
అసెంబ్లీ చర్చలో బాబుపై చెలరేగిన ధర్మాన

అమరావతి,జనవరి28(ఆర్ఎన్ఎ): శాసన మండలి వ్యవస్థకు తెలుగుదేశంగా పార్టీ వ్యతిరేకమని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. మండలి వ్యవస్థను తాము వ్యతిరేకమని, అధికారంలోకి వస్తే.. దాన్ని రద్దు చేస్తామంటూ ఇదివరకు చంద్రబాబు నాయుడు నిండు సభలో ప్రకటించారని చెప్పారు. మండలి వ్యవస్థ అవసరం లేదంటూ నాడు చంద్రబాబు చేసిన సూచనలను తాము ఇప్పుడు అమలు చేస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. శాసన మండలి రద్దుపై సోమవారం శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన తీర్మానంపై ధర్మాన ప్రసాద రావు మాట్లాడారు. ఎన్నికలో గెలవలేని వారికి శాసన మండలి రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని, ఈ శాసనమండలి వ్యవస్థ వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందే తప్ప ఎలాంటి ఉపయోగం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారని అన్నారు. మన రాష్ట్రానికే చెందిన దివంగత నేత డాక్టర్ ఎన్జీ రంగా కూడా శాసనమండలిని వ్యతిరేకించారని చెప్పారు. దేశ రాజకీయాల్లో హేమాహేమీలుగా పేరున్న గోపాలకృష్ణ అయ్యంగార్, హెచ్ వి కామత్ వంటి జాతీయ నేతలు కూడా దీన్ని వద్దనే చెప్పారని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో మాత్రమే శాసనమండలి ఉందని ధర్మాన ప్రసాద రావు పేర్కొన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులు తిరిగి శాసనమండలికి వస్తున్నారని, ప్రజల ద్వారా ఎన్నుకున్న ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజలు ఇచ్చిన తీర్పును శాసన మండలి సభ్యులు అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. శాసన మండలిని రద్దు చెయ్యడం పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని చెప్పుకొచ్చారు. తమకు శాసన మండలిలో బలం ఉందనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం రూపొందించిన అనేక ప్రజోపయోగకరమైన బిల్లులను తెలుగుదేశం పార్టీ అడ్డుకోవడానికి ప్రయత్నించిందని ధర్మాన విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీల కోసం తమ ప్రభుత్వం ఏర్పాటు చేయదలిచిన కార్పొరేషన్ బిల్లును ఎందుకు అడ్డుకునే ప్రయత్నం చేశారని నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధనను కొనసాగించడానికి రూపొందించిన బిల్లును కూడా మండలి ద్వారా అడ్డుకొనే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజలకు మేలు చేసే బిల్లులను కూడా శాసన మండలి అడ్డుకోవడానికి ప్రయత్నించిందని, అలాంటి వ్యవస్థను రద్దు చేయడాన్ని తాను సమర్థిస్తున్నానని ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను చూసే రాష్ట్ర ప్రజలు 151 మంది ఎమ్మెల్యేలను తమకు అందించారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను తాము నెరవేర్చబోతున్నామని అన్నారు. మూడు ప్రాంతాల్లో మూడు రాజధానులను ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రం సమగ్రంగా, సమతుల్యంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అలాంటి బిల్లులను అడ్డుకోవడం హాస్యాస్పదమని అన్నారు.

శాసనమండలి రద్దుకు ఓకే అన్న రోజా

ఏపి శాసనమండలి రద్దు తీర్మానానికి తన మద్దతు తెలుపుతున్నానని వైసిపి ఎమ్మెల్యే రోజా అన్నారు. మండలి రద్దు తీర్మానంపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వికేంద్రీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కౌన్సిల్ కు పంపిస్తే అక్కడ అవమానించడం దారుణమని అన్నారు. ఇలా అవమానించడాన్ని చూస్తూ ఊరుకుంటూ పోతే, చంద్రబాబు లాంటి పొలిటికల్ క్రిమినల్స్ ఎంతకైనా దిగజారతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మండలిలో జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అన్ని ప్రాంతాలను సమానంగా చూడాలని, అభివృద్ధి సమానంగా ఉండాలని మన రాజ్యాంగం సూచిస్తుందని చెప్పారు. గతంలో ఎవరూ చేయని ప్రయత్నం సీఎం జగన్ చేశారని, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని, అందుకు సంబంధించిన బిల్లును తీసుకొచ్చారని అన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత దాదాపు 30 బిల్లులను తీసుకొచ్చారని, మూడు ప్రాంతాల ప్రజల కలలను సాకారం చేసే వ్యక్తి జగన్ అని అభినందిస్తున్నారని రోజా అన్నారు.

మండలి సీట్లను అమ్ముకున్నారు: చర్చలో రజని

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు ఐదేళ్లు చంద్రబాబు నాయుడుకి సమయం ఇచ్చినా ఉపయోగించుకోలేపోయారని వైస్సార్‌సీపీ ఎమ్మెల్యే విడదల రజనీ విమర్శించారు. శాసనమండలి రద్దు పై సోమవారం అసెంబ్లీలో చర్చలో మాట్లాడుతూ మండలిపై చంద్రబాబు తొలినుంచి రెండు నాల్కల సిద్ధాంతంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే చంద్రబాబుకు శాసనమండలి బంగారుబాతులా కనిపించిందని, కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలకు ఎమ్మెల్సీ సీట్లు అమ్ముకున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. యనమల రామకృష్ణుడు ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని రజనీ విమర్శించారు. మండలిని రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వాన్ని హేళన చేసే విధంగా మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. నారా లోకేష్‌కు రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన పెద్దల సభను.. తక్కువ చేసి మట్లాడం సరికాదని హితవుపలికారు. ప్రజల అవసరాలకు ఏమాత్రం ఉపయోగంలేని మండలిని రద్దు చేస్తామంటే పెద్దల సభ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ ఇద్దరూ స్వాగతించారని సభలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని తామంతా స్వాగతిస్తున్నామని రజనీ స్పష్టం చేశారు.

హుందాగా ఉండలేకపోతున్న కెసిఆర్

**నిజామాబాద్‌లో కాంగ్రెస్

మండలి రద్దుతో నష్టపోయేది టిడిపియే

అందుకే రద్దును తప్పుపడుతున్న చంద్రబాబు
గతాన్ని గుర్తు చేసుకుని బాబు మాట్లాడితే మంచిది
రాజకీయ పునరావాసాల ఏర్పాటు సరైంది కాదని గుర్తించాలి

అమరావతి,జనవరి28(ఆర్ఎన్ఎ): ఊహించినట్టుగానే ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం శాసనమండలి రద్దుకు శాసనసభలో తీర్మానం చేసింది. మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి వికేంద్రీకరణ, సీఆర్డీయే బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపాలన్న చైర్మన్ షరీఫ్ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి జగన్ ఎంతమాత్రం సహించలేకపోయారు. ఇందుకు ప్రతిగా ఆయన అడ్డుగా ఉన్న మండలినే తొలగించేందుకు సిద్ధపడ్డారని టిడిపి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటి రాజధాని అంశమే కాదు, ప్రభుత్వ భవిష్య నిర్ణయాలు వేటిపైనా ఇక ప్రశ్న, చర్చలకు అవకాశం ఇవ్వకూడదన్నది ముఖ్యమంత్రి ఉద్దేశంగా కనిపిస్తున్నదని గట్టిగా వినిపిస్తున్నారు. అయితే రద్దువల్ల నష్టపోతున్నది కేవలం తెలుగుదేశం మాత్రమే. అలాగే బిజెపికి కూడా నష్టం ఉంది. ఉన్న రెండు ఎమ్మెల్సీలు కూడా పోతాయన్న భయం ఉంది.

శాసన మండలి రద్దుకు సంకల్పించినది మొదలు ముఖ్యమంత్రి, మంత్రులు తమ ఆలోచనలకు అనుగుణంగా సమర్థంగా వాదనలు ముందుకు తెచ్చారు. శాసనసభలోనే విద్యావంతులు, మేధావులు నిండుగా ఉన్నప్పుడు విడిగా ఈ మేధావుల సభ ఎందుకని స్వయంగా సిఎం వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకున్నప్పుడు ఏటా అరవైకోట్ల అదనపు ఖర్చు అవసరమా అన్నారు. గతంలో, శాసనసభలో విద్యావంతులు, మేధావులు లేనందునే మండలి ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేశారు. కానీ ఇప్పుడా అవసరం లేదు. నిజానికి రాజకయీ పునరావాస లోటు పూడ్చేందుకే వై.ఎస్. రాజశేఖరరెడ్డి శాసనమండలిని పునరుద్ధరించారన్నది కాదనలేని నిజం. లోక్‌సభలో మెజారిటీ ఉన్న బీజేపీ, రాజ్యసభలో పైచేయిగా ఉన్న కాంగ్రెస్ ఏ విధంగా వ్యవహరిస్తున్నాయో చూస్తున్నదే. అయితే అక్కడ రాజ్యసభ అన్నది రాజ్యాంగ వ్యవస్థలో భాగం. కానీ రాష్ట్రాల్లో అలాంటి అవకాపం లేదు. లోక్‌సభ ఆమోదించిన ఎన్నో బిల్లులను రాజ్యసభ సెలక్ట్ కమిటీకి పంపుతున్నది. కేంద్రంలో బీజేపీ తొలివిడత పాలనాకాలంలో రాజ్యసభలో దాని బలం మరీ తక్కువ. తమ తరఫున ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించేందుకు రాజ్యసభ అవకాశం కల్పించింది. మండలి ప్రయోజనాలను ఏరకంగానూ ప్రజాకోణం నుంచి చూడలేము. రాజకీయ పునరావాసం కోసమే ఇది పనికి వస్తుందన్నది నిర్వివాదాంశం. ఇప్పుడు ఎపి మండలిలో అలాంటి అవసరమే టిడిపికి ఉంది. అందుకే ఆ పార్టీ తన గళాన్ని గట్టిగా వినిపిస్తూ గతానికి..నేటికి తేడా అని వాదిస్తోంది. అత్యంత కీలకమైన అంశాలపై ఉన్నతమైన, అర్థవంతమైన చర్చలకు శాసనమండలి వేదికగా నిలిచిన సందర్భాలు అనేకం ఉన్నా..రానురాను అది రాజకీయ వేదికగానే మారింది. గతంలో ఎన్టీఆర్ మండలిని రద్దుచేయడమూ, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి అందుకు కంకణం కట్టుకోవడం రెండూ సరైన నిర్ణయాలుగా స్వాగతించాలి. ప్రజాప్రయోజనాల దృష్ట్యా మండలి అవసరం లేకున్నా టిడిపి రాజకీయ అవసరాల కోసం యాగీ చేస్తోంది. మండలిలో ఉన్న బలాన్ని అడ్డుపెట్టుకొని తెలుగుదేశం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసిపీ నాయకులు విమర్శిస్తున్న తీరు కూడా సరైనదే కావచ్చు. తాము కోరినట్టుగా జరగనందున ఇక దానితో అవసరం లేదని తీర్మానించి మండలిని భూస్థాపితం చేయాలనుకోవడం నియంతృత్వపు పోకడగా టిడిపి చేస్తున్న విమర్శల్లో ఏ మాత్రం సందర్భం లేదు. అయితే తమకు అడ్డులేదనుకున్నప్పుడు మండలిని తేవడం, నచ్చనప్పుడు రద్దుచేయడం సరికాదు. దీనిని మొత్తంగానే తొలగించడం మంచి పని. టిడిపి కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించి దానిని తిరిగి పునరుద్ధరిస్తామనే ప్రతినలు మానాలి. రాజకీయ పునరావాస కేంద్రాల ఏర్పాటును అడ్డుకోవాలి.

జనరల్ మహిళా సీటులో బిసి మహిళ

మున్సిపల్ పీఠంపై తొలి మహిళామణి
హుస్నాబాద్ మున్సిపల్‌లో అనూహ్య పరిణామం

సిద్దిపేట,జనవరి28(ఆర్ఎన్ఎ): హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ పీఠాన్ని మొట్ట మొదటిసారిగా బీసీ మహిళనువరించింది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ జనరల్ మహిళా స్థానంలో బీసీ మహిళకు కట్టబెట్టారు. వైస్ చైర్ పర్సన్ పదవిని పురుషుడికి అప్పగిస్తారని భావిస్తే అన్యూహంగా వైస్ చైర్ పర్సన్ పదవిని సైతం మహిళకు అప్పగించడం హుస్నాబాద్ చరిత్రలో ఇదే మొదటిసారి. దీంతో దాదాపు 30ఏళ్ల తర్వాత అతివలు పాలించే అవకాశం దక్కింది. 20 మంది వార్డు మెంబర్లకు ఇందులో 11 మంది మహిళలే కావడం, అందులో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులు మహిళలనే వరించడంతో మున్సిపల్‌లో మహిళా సాధికారత వెల్లివిరియనుంది. మున్సిపల్ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది.

మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఆకుల రజితకు మద్దతుగా టీఆర్ఎస్‌కు చెందిన 9 మంది, ఇండిపెంటెండెంట్లు ఇద్దరు, ఎక్స్ అఫియోసభ్యుడు ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌లు మొత్తం 12 సభ్యులు చేతులు లేపి మద్దతు తెలిపారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి చిత్తారి పద్మకు కాంగ్రెస్‌కు చెందిన 6గురు, ఇండిపెంటెండెంట్ అభ్యర్థి జనగామ రత్నలు చేతులెత్తి మద్దతు పలికారు. దీంతో రజితకు 12 మంది మద్దతు పలుకగా, పద్మకు 7గురు మద్దతు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఆకుల రజిత ఎన్నికైనట్లు ప్రకటించారు. హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు సత్తా చాటారు. ఇక మున్సిపాలిటీలోని 20వ వార్డు అభ్యర్థినిగా టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన వాల సుప్రజా నవీన్‌రావు భారీ మెజార్టీ సాధించారు. సిద్దిపేట జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సాధించిన అభ్యర్థినిగా నిలిచారు.

బాలుడిని బంధించి ప్రియుడితో జంప్

–బాలుడు మృతి..కేసుపెట్టిన భర్త

ఛండీఘర్,జనవరి28(ఆర్ఎన్ఎ): ఓ తల్లి తన రెండున్నరేండ్ల కుమారుడిని చంపి ప్రియుడితో లేచిపోయిన ఘటన చండీఘడ్‌లో చోటుచేసుకుంది. ఘటన ఛండీఘర్‌కు సమీపంలోని బురాలి గ్రామంలో ఆదివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది.

దశరథ్ అనే వ్యక్తి భార్య, ఒక కుమారుడు(2.5) ఉన్నారు. దశరథ్ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. అయితే ఆయన భార్యకు మరో వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బాలుడిని తన ఇంట్లో బెడ్ బాక్స్‌లో కుక్కింది. అరవకుండా ఉండేందుకు బాలుడి నోట్లో బట్ట ముక్క కుక్కి.. తన ప్రియుడితో లేచిపోయింది తల్లి. సాయంత్రం ఇంటికొచ్చిన దశరథ్ తన భార్య, కుమారుడి కోసం వెతికాడు. మొదట బంధువుల ఇంటికెళ్లి ఉండొచ్చు అని దశరథ్ భావించాడు. కానీ బంధువుల ఇంటికి వారు వెళ్లలేదు. దీంతో భార్యకు ఫోన్ చేయగా.. బాలుడిని బెడ్ బాక్స్‌లో ఉంచినట్లు చెప్పింది. బెడ్ బాక్స్‌ను తెరిచి చూడగా పిల్లాడు ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు. దశరథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

చెట్టును ఢీకొన్న స్కూలు బస్సు
పలువురు విద్యార్థులకు గాయాలు

నిజామాబాద్,జనవరి28(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. అధికవేగమే ఇందుకు కారణంగా సమాచారం. ప్రమాదంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రణవ్, మున్నాలు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొని మిగతా విద్యార్థులను రక్షించారు. గాయపడ్డ విద్యార్థులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నేరేడుచర్లలో కూడా కాంగ్రెస్‌కు భంగపాటు

అధికార పీఠాన్ని తన్నుకుపోయిన టిఆర్ఎస్
ఎక్స్ అఫీషియోగా ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేరు
ఛైర్మన్‌గా చందమల్లు జయబాబు ఎన్నిక
ఎన్నికను బహిష్కరించిన కాంగ్రెస్
ఆందోళనకు దిగిన ఉత్తమ్ తదితరుల అరెస్ట్

సూర్యాపేట,జనవరి28(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వాప్తంగా ఉత్కంఠ రేపిన నేరేడుచర్ల మున్సిపల్ పీఠం అధికార టీఆర్ఎస్ పార్టీనే కైవసం చేసుకుంది. తగిన మెజారిటీ లభించడంతో టీఆర్ఎస్‌కు చెందిన చందమల్లు జయబాబు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే ఛైర్మన్ ఎన్నిక చివరి వరకు నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయం వద్ద యుద్ధ వాతావరణం తలపించింది. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి ఎక్స్‌అఫీషియో ఓటు హక్కు కల్పించడంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం తెలిపింది. అంతేకాకుండా ఆయనను కార్యాలయం నుంచి బయటకు పంపించి నిన్నటి జాబితా ప్రకారమే ఎన్నిక ప్రకియ చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే ఈసీ ప్రకటించిన కొత్త జాబితా ప్రకారమే ఎన్నిక పక్రియ చేపడతామని అధికారులు స్పష్టం చేయడంతో కాంగ్రెస్ సభ్యులు ఎన్నికల నుంచి వాకౌట్ చేశారు. దీంతో ఏడుగురు కౌన్సిల్ సభ్యులు, నలుగురు ఎక్స్‌అఫీషియో ఓట్లతో టీఆర్ఎస్ నేరేడుచర్ల మున్సిపల్ పీఠాన్నికైవసం చేసుకుంది. ఎన్నికల పక్రియ నుంచి బయటకు వచ్చిన కాంగ్రెస్ రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టింది. దీంతో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అక్రమాలతో ఛైర్మన్ పదవిని దక్కించుకోవడానికి తెరాస ప్రయత్నిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తిని ఎక్స్ అఫిషియో సభ్యుడిగా చేర్చారని విమర్శించారు. సమావేశం జరుగుతున్న సమయంలో ఇరు పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఎదుటే ఇరుపార్టీల నేతలు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ బహిష్కరించింది. ఇరుపార్టీలు ఈ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం తెరాస సభ్యుల తోనే సమావేశం నడిపించారు. అంతకుముందు ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డిని ఎక్స్‌అఫిషియో జాబితాలో చేర్చడంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఎస్ఈసీ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరి స్తోందని ఆరోపించారు. ఎన్నికలే నిర్వహి ంచకపోతే పోటీ ఉండేది కాదు కదా అని మండిపడారు. కేటీఆర్ ఎన్నికల అక్రమాలకు నేరేడుచర్ల మున్సిపల్ ఎన్నికలే నిదర్శనం. 25వ తేదీ వరకే ఎక్స్‌అఫిషియో సభ్యుల నమోదు జరగాలని నిబంధనలు ఉన్నాయి. ఈ రోజు నేరేడుచర్ల మున్సిపల్ సభ్యులుగా ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి పేరు నమోదు చేయిస్తున్నారు. ఇది అక్రమం, నిబంధనలకు విరుద్ధం. ఇక ఎన్నికలు ఎందుకు.. కేటీఆర్ ఇంట్లో కూర్చుని రాసుకుంటే సరిపోతుంది కదా..?అని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. నేరేడుచర్ల మున్సిపల్ ఛైర్మెన్ ఎన్నికల వ్యవహారాన్ని మంగళవారం ప్రారంభిం చారు. ఇద్దరు సభ్యులు కూడా ప్రమాణం చేశారు. అప్పుడు ఎమ్మెల్యే గొడవ చేసి వాయిదా వేయించారు. ఇప్పుడు కొత్తగా సభ్యులను నమోదు చేయిస్తున్నారు. ఇది ఎన్నికల అక్రమాలకు పరాకాష్ఠ. 25వ తేదీ లోపు ఎక్స్ అఫిషియో సభ్యుల నమోదు చేయించాలని నాకే స్వయంగా మున్సిపల్ శాఖ కార్యదర్శి, ఎన్నికల కమిషనర్ చెప్పారు, మరి ఎన్నికల పక్రియ ప్రారంభమై కొంత జరిగిన తర్వాత ఇప్పుడు కొత్తసభ్యుల నమోదు ఏంటి..? ఇంత దారుణ అక్రమాలు ఉంటాయా..? రాష్ట్రంలో కేటీఆర్ అక్రమాలు శ్రుతి మించిపోయాయి.. ఎన్నికలు ఎలా జరుగుతున్నాయో ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, ప్రజలు గమనించాలి, అర్థం చేసుకోవాలని ఉత్తమ్‌కుమార్ అన్నారు.

ఢిల్లీలో పెరుగుతున్న రాజకీయ వేడి

అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పరస్పర విమర్శలు
ప్రచారంలో దూసుకుని పోతున్న బిజెపి

న్యూఢిల్లీ,జనవరి28(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఎన్నికల తేదీలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రచారంలో విమర్శలు కూడా పెరుగుతున్నాయి. పరస్పర విమర్శలతో దేశరాజధాని రాజకీయం వేడెక్కుతోంది. అరవింద్ కేజీవ్రాల్ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని ఢిల్లీ బీజేపీ చీఫ్, ఎంపీ మనోజ్ తివారీ అన్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని ఆయన తన ఎమ్మెల్యేలతో కొట్టించారని, ఇటు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలూ అమలు చేయలేదని ఆయన ఆరోపించారు

. కేజీవ్రాల్ పరిపాలన నచ్చకపోవడంతోనే.. ఆయనకు వ్యతిరేకంగా వందలమంది నామినేషన్లు వేశారని అన్నారు. ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 45 సీట్లకుపైనే వస్తాయని అన్నారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సత్తా చాటిందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం రాకపోవడం వల్ల ఢిల్లీకి నష్టం జరిగిందన్నారు. దేశానికి మోదీ, ఢిల్లీకి బీజేపీ అనేది తమ నినాదమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఎక్కడ గుడిసె ఉందో, అక్కడే నిరుపేదలకు ఇల్లు కట్టించి.. గ్యాస్, టాయిలెట్ సౌకర్యం కల్పించిందని చెప్పారు. కుషల్ ఢిల్లీ తమ లక్ష్యమన్నారు. ఇదిలావుంటే పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా నెలరోజులుగా కొనసాగుతున్న షహీన్‌బాగ్ నిరసనలపై బీజేపీ ఎంపీ పర్వేష్ వర్మ మండిపడ్డారు. ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో తమకు అధికారమిస్తే కేవలం గంటలోనే షహీన్‌బాగ్ నిరసనలకు ముగింపు పలుకుతామని అన్నారు. ఫిబ్రవరి 11న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే షహీన్ బాగ్లో ఒక్క వ్యక్తి కూడా కనబడదని వికాస్‌పురి అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం జరిగిన సమావేశంలో పర్వేష్ వర్మ తెలిపారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం నెలరోజులు సమయం ఇవ్వండి. నా నియోజకవర్గం లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన మసీదులన్నింటినీ తొలిగిస్తాను' అని ఆయన స్పష్టం చేశారు. లక్షలాది మంది ప్రజలు షహీన్‌బాగ్‌లో గుమిగూడుతున్నారని, ప్రజలు ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని అయన సూచించారు. షహీన్‌బాగ్ ఆందోళనకారుల వల్ల ప్రజలకు హాని జరగవచ్చని, ప్రజలు మేలుకోవాల ని అన్నారు. వాళ్లు మీ ఇళ్లలోకి రావచ్చు, మీ చెల్లెల్లు, కూతుళ్లపై అత్యాచారాలకు పాల్పడవచ్చు, ప్రాణాలు కూడా తీయవచ్చు. ఇవాళ మీకు సమయం ఉంది. రేపు మోదీ కానీ, అమిత్‌షా కానీ మిమ్మల్ని కాపాడలేక పోవచ్చు. ఇప్పుడే ప్రజలు మేల్కోవాలి' అని ఎంపీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ వివాదంలో ఇరుక్కున్నారు. ఢిల్లీలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన కొన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఢిల్లీ సీఈవో నివేదిక కోరినట్లు తెలుస్తోంది. సోమవారం రితాలా నియోజకవర్గంలో జరిగిన ఓ సభలో అనురాగ్ ఠాకూర్ ప్రసంగం చేస్తూ.. సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నవారంత దేశద్రోహులు అన్నారు. దేశ్ కా గద్దారోంకో అంటూ అనురాగ్ నినాదం ఇవ్వగానే.. ర్యాలీకి వచ్చిన జనం అంతా గోలీ మారో అంటూ అరిచారు. సీఏఏకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నవారిని కాల్చి పారేయాలన్న ఉద్దేశం వచ్చే విధంగా కేంద్ర మంత్రి వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ .. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసింది. అనురాగ్ ఠాకూర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఠాకూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆ ర్యాలీలో అనేక మంది బీజేపీ నేతలు కూడా పాల్గొన్నారు. జనాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. ముందుగా ఆ వీడియోను చూడాలని ఠాకూర్ అన్నారు. సభకు వచ్చిన జనం మూడ్‌ను గమనించాలని ఆయన తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

వ్యూహాలతో గట్టెక్కిన గులాబీ

ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ప్రణాళిక
బిజెపి స్థానాల్లోనూ పాగా

మహబూబ్‌నగర్,జనవరి28 (ఆంఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణం నుంచే అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంత్రులు వ్యూహాలు పన్నడంతో బిజెపి డంగయ్యింది. అధికారపార్టీకి అండగా యంత్రాంగం కూడా నిలిచింది. ఎన్నికలు జరిగిన 17 మున్సిపాలిటీల్లో కేవలం 8 స్థానాల్లోనే స్పష్టమైన మెజార్టీ సాధించిన టీఆర్ఎస్ మిగతా పీఠాలను సైతం కైవసం చేసుకునేలా వ్యూహాలు రచించింది. ఈ క్రమంలో మెజార్టీ సాధించని భూత్పూర్, కోస్గి, నారాయణపేట, అమరచింత, కల్వకుర్తి, కొల్లాపూర్, అయిజ పురపాలికలపై జెండా ఎగరవేసింది. గులాబీ పార్టీ ఎత్తుగడలతో గెలుపునకు ఆస్కారమున్న భూత్పూర్, నారాయణపేట పీఠాలను బీజేపీ పోగొటుకుంది. ఉమ్మడి జిల్లాలో కేవలం మక్తల్‌లో మాత్రమే కాషాయం జెండా ఎగిరింది. ఇటు నిన్నటి వరకు కోస్గి పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమనే పూర్తి ధీమాతో ఉన్న ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగలింది. రెండ్రోజుల్లో చోటు చేసుకున్న పరిణామాలతో కోస్గి పీఠం చేజారింది. వ్యూహాత్మకంగా వ్యవహరించిన టీఆర్ఎస్ అనూహ్యంగా పాగా వేసింది. చైర్మన్ రేసులో ఉన్న అభ్యర్థులు తమకున్న సభ్యుల బలగాన్ని రహస్య శిబిరాలకు తరలించి సోమవారం నేరుగా ఆయా మున్సిపాలిటీలకు తరలించారు. ముందుగా గెలిచిన అభ్యర్థులు కౌన్సిలర్లుగా ప్రమాణస్వీకారం చేయగా.. తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్లను ఎనుకున్నారు. ఇందులో కొల్లాపూర్ కథ సుఖాంతమైంది. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వర్గీయులు 9 మంది గెలుపొందగా.. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలో దిగిన జూపల్లి వర్గీయులు 11 మంది విజయం సాధించారు. దీంతో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పుర పీఠాన్ని కైవసం చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తమ ఎక్స్‌అఫీషియో ఓట్లతో ఆ పుర పీఠంపై గులాబీ జెండా ఎగరేసేందుకు స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కొల్లాపూర్‌కు చేరుకున్నారు. ముందుగా కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు అనూహ్యంగా సమావేశ గది బయటికి వెళ్లిపోయారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో ఓట్లతో టీఆర్ఎస్ కొల్లాపూర్ పురంపై గులాబీ జెండా ఎగిరింది. మక్తల్‌లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల ఎంపిక పక్రియలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య తలెత్తిన వివాదం తారాస్థాయికి చేరుకుంది. పట్టణంలో మొత్తం 16 వార్డులు ఉంటే.. టీఆర్ఎస్ 5, బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ రెండు, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు గెలిచారు. పుర పీఠంపై పాగాకు వ్యూహం రచించిన బీజేపీ.. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరిని జత కలుపుకుంది. ఒప్పందంలో భాగంగా చైర్‌పర్సన్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి పావనికి అనుకూలంగా అందరూ చెయ్యి ఎత్తారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థుల వైస్‌చైర్‌పర్సన్‌కు బీజేపీ అభ్యర్థులు సహకరించకపోగా.. తమ పార్టీకి చెందిన అఖిలను వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. బీజేపీ నేతల తీరుపై కాంగ్రెస్ కౌన్సిలర్లు మండిపడ్డారు. తమను నమ్మించి మోసం చేశారని బీజేపీ నాయకత్వంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. కల్వకుర్తి మున్సిపల్ పరిధిలో స్థానిక ఎమెల్యే జైపాల్‌యాదవ్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్న షానవాజ్ ఖాన్‌కు వైస్ చైర్మన్ పదవి వరిస్తుందని అందరూ భావించారు. కానీ చైర్మన్‌గా ఎడ్మ సత్యం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గత పాలకవర్గంలో వైస్ చైర్మన్‌గా పని చేసి.. ఈ సారి మరోసారి గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కృష్ణారెడ్డి అనుచరుడు షాహీద్ పేరు తెరపైకి వచ్చింది. గెలిచిన అభ్యర్థులందరూ షాహీద్ వైపే మొగ్గుచూపడంతో అతను వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. దీంతో ఎమ్మెల్యే వర్గీయుల్లో కాస్త అసంతృప్తి వ్యక్తమవుతోంది. అమరచింతలో మారిన రాజకీయ సమీకరణాలు గులాబీ నేతలను కాస్త ఆందోళనకు గురి చేశాయి. అక్కడున్న పది వార్డుల్లో టీఆర్ఎస్ మూడు, సీపీఎం రెండు, బీజేపీ, టీడీపీ, సీపీఐ, కాంగ్రెస్, స్వతంత్రులు ఒక్కో స్థానంలో గెలుపొందిన విషయం తెలిసిందే. తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన రాజకుమార్ కారెక్కారు. ఆరో వార్డు నుంచి గెలిచిన మాధవి, పదో వార్డు నుంచి గెలుపొందిన గోపి సీపీఎం అభ్యర్థులతో పురపీఠం కైవసం చేసుకుందామని భావించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి మద్దతు విషయంలో ఒక అభ్యర్థిపై అనుమానం వచ్చింది. ముందస్తు జాగ్రత్తగా ఎక్స్‌అఫీషియో ఓటు వేద్దామనే ఆలోచనతో అమరచింత మున్సిపాలిటీకి చేరుకున్నా.. సదరు అభ్యర్థి సైతం టీఆర్ఎస్ వైపే మొగ్గు చూపడంతో ఓటు అవసరం లేకుండానే గులాబీ అక్కడ జెండా ఎగరవేసింది. భూత్పూర్ మున్సిపల్ పరిధిలో పది వార్డులకు టీఆర్ఎస్, బీజేపీ నాలుగు చొప్పున స్థానాలు గెలుచుకోగా.. కాంగ్రెస్ అభ్యర్థులు రెండు వార్డుల్లో గెలిచారు. దీంతో రంగంలో దిగిన దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం రాత్రి 11గంటల ప్రాంతంలో గెలిచిన బీజే పీ అభ్యర్థుల్లో ఇద్దరికి గులాబీ కండువా కప్పా రు. దీంతో గులాబీ బలం ఆరుకు చేరింది.బీజే పీ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి విప్ జారీ చేసి వెళ్లినా.. ఆ పురంపై గులాబీ జెండా ఎగరడాన్ని మాత్రం అడ్డుకోలేకపోయారు. అయితే.. బీజేపీ నుంచి గెలిచి కారెక్కిన కెంద్యాల శ్రీనివాస్‌కు వైస్ చైర్మన్ పదవి వరించింది.

శబరిమలపై 10 రోజుల్లో విచారణ పూర్తి

–సుప్రీం ప్రధాన న్యాయమూర్తి శరద్ అరవింద్ బోబ్డే

న్యూఢిల్లీ,జనవరి28(ఆర్ఎన్ఎ): శబరిమలలో అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ గతంలో ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్ల విచారణ కోసం ఏర్పాటు చేసిన తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం 10 రోజుల్లో తన విచారణ ముగిస్తుందని ప్రధాన న్యాయమూర్తి శరద్ అరవింద్ బోబ్డే మంగళవారం సూచనప్రాయంగా వెల్లడించారు. శబరిమల తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్ల కోసం గత ఏడాది ఏర్పాటు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం లేవనెత్తిన కొన్ని రాజ్యాంగపరమైన అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల మొదట్లో తొమ్మిదిమంది న్యాయమూర్తులతో చీఫ్ జస్టిస్ బోబ్డే ధర్మాసనం ఏర్పాటు చేశారు. అయోధ్యలోని రామజన్మ భూమి వివాదంపై గతంలో రూపొందించిన తీరులో కొన్ని ప్రశ్నల పట్టికను రూపొందించి తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఎదుట ఉంచాలని చీఫ్ జస్టిస్ ఇదివరకు ఆదేశించారు. ఇందుకోసం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జనవరి 17న ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. కాగా, ఈ సమావేశంలో వివిధ అంశాలపై న్యాయవాదులలో ఏకాభిప్రాయం కుదరలేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మంగళవారం చీఫ్ జ